# విశాల భారతి

02-06-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 148




## తల తాకట్టు పెట్టయినా ఇళ్లు కడతాం

- పేదలకు ఆత్మగౌరవంతో కూడిన గృహాల కల్పన
- 4.5 లక్షల ఇళ్ల మంజూరు, ఇప్పటికే లక్షకు పైగా నిర్మాణం పూర్తి
- గిరిజన గూడెలకు అదనపు ఇళ్ల కేటాయింపు.
- కులమతాలకు అతీతంగా పేదరికమే ప్రామాణికం
- మరో 2 లక్షల ఇళ్లను రెండు నెలల్లో పూర్తి చేసే లక్ష్యం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందే వరకు పథకం కొనసాగింపు

02

## గో బ్యాక్ మిస్టర్ పవన్ కల్యాణ్



- రాజధాని లేని మీరు తెలంగాణను ఉద్ధరించడం విడ్డూరం
- ముందు మీ అమరావతిని బాగు చేసుకోండి
- టీడీపీ, జనసేన కుట్రలను తెలంగాణ సహించదు
- తెలంగాణను మేమే పాలిస్తాం, మీ అవసరం లేదు
- నెలలోగా ఉద్యమకారులకు భూములు పంచండి, లేదంటే ఆక్రమిస్తాం
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టనివ్వం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ గడ్డపై మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న కల్వకుంట్ల కవిత గారు, పవన్ కల్యాణ్ పర్యటనల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నవ నిర్మాణ సభల పేరుతో తెలంగాణలో కాలు మోపుతున్న పవన్ కల్యాణ్ వైఖరిని ఆమె తూర్పారబట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక ప్రామాణికమైన సచివాలయాన్ని కూడా నిర్మించుకోలేని స్థితిలో ఉండి, తెలంగాణను ఉద్ధరిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. పవన్ కేవలం సినిమా యాక్టర్ మాత్రమేనని, తెలంగాణలోని ప్రతి ఇంటికో హీరో ఉన్నాడనే విషయాన్ని ఆయన గ్రహించాలని స్పష్టం చేశారు. తెలంగాణలో విచ్ఛిన్నకర రాజకీయ కుట్రలను ఆపాలని, గో బ్యాక్ మిస్టర్ పవన్ కల్యాణ్ అంటూ

మిగతా 3లో..

## ఉద్యోగుల బదిలీలపై మళ్లీ నిషేధం

- జూన్ 1 నుండి బదిలీలపై ఆరు నెలల నిషేధం
- ప్రమోషన్లు, డెప్యుటేషన్లు, అత్యవసరాలకు మాత్రమే అవకాశం
- ఏ అత్యవసర బదిలీకైనా ముఖ్యమంత్రి అనుమతి తప్పనిసరి
- ఖాళీ ఉన్న పోస్టుల్లోనే నియమించాలి
- ఏడాది సర్వీస్ పూర్తయిన వారికే అర్హత
- నిబంధనలు దాటితే జీతాల బిల్లులు నిలిపివేస్తారు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యింది. ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జీవో నంబర్ 57తో పాలనా యంత్రాంగంలో ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవహించింది. గత నెల రోజులుగా బదిలీల ప్రక్రియ ఊపందుకోగా,

మిగతా 3లో..

# 12 నవతెలంగాణ ఏళ్ల సంబురం

## అమరుల త్యాగాలతో సాధించిన అస్తిత్వ విజయం

- నీళ్లు-నిధులు-నియామకాల కోసం సాగిన ప్రజాపోరాటం
- 2014 జూన్ 2న ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు
- సాగునీరు, విద్యుత్, పరిపాలనలో అద్భుత ప్రగతి
- ఉద్యమ అమరుల బలిదానాలే మన రాష్ట్ర పునాది
- అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నవతెలంగాణ నిర్మాణం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ అంటే కేవలం ఒక భౌగోళిక సరిహద్దు కాదు, ఆరు దశాబ్దాల పాటు రగులుతూ, చివరకు ఉవ్వెత్తున ఎగసిన అఖండ ఆకాంక్ష. ఆదిలాబాద్ అడవుల నుంచి పాలమూరు పల్లెల దాకా, ఓరుగల్లు కోటల నుంచి హైదరాబాద్ గల్లీల దాకా ప్రతి గుండెలోనూ రగిలిన స్వరాష్ట్ర కాంక్ష. ఎందరో మహానుభావుల కల, వేలాది మంది అమరుల ప్రాణత్యాగం, కోట్లాది మంది ప్రజల నిరంతర పోరాట ఫలితమే నేటి స్వయంప్రతిపత్తి కలిగిన తెలంగాణ. 2014 జూన్ 2న భారతదేశపు 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన గడ్డ, నేడు పదకొండేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని, పన్నెండవ ఏట ఘనంగా అడుగుపెట్టింది. ఈ ప్రయాణం కేవలం అభివృద్ధి ప్రయాణం మాత్రమే కాదు, అస్తిత్వ పోరాటంలో గెలిచిన విజయ కేతనం. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ స్టేట్‌గా భారత యూనియన్‌లో విలీనమైన ప్రాంతం, 1956 నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్రంతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో భాగమైంది. నాటి పెద్దమనుషుల ఒప్పందం తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుతుందని అందరూ ఆశించారు. ఉద్యోగాల నియామకాల్లో జనాభా నిష్పత్తి, 12 ఏళ్ల నివాస నిబంధన, కేబినెట్‌లో సరైన వాటా వంటి షరతులు అక్షరాలై నిలిచాయి. అయితే, కాలక్రమేణా ఒప్పందాలు కాగితాలకే పరిమితం కావడం, నీళ్లునిధులునియామకాల్లో తెలంగాణ తీవ్ర వివక్షకు గురి కావడం ప్రజల్లో అసహనాన్ని, నిరసనను అగ్నిపర్వతంలా మార్చింది. ప్రాంతం తన వనరులను కోల్పోతున్నప్పుడు కలిగే ఆవేదన ఉద్యమ రూపాన్ని దాల్చింది. వశిష్ట భార్గవ కమిటీ నివేదికలు తెలంగాణ మిగులు నిధులు ఇతర ప్రాంతాలకు మళ్లాయని స్పష్టం చేశాయి. నిబంధనలను పక్కనపెట్టి స్థానికేతరులను ఉద్యోగాల్లోకి చేర్చుకోవడం స్థానిక యువతను ఆవేదనకు గురిచేసింది. అన్యాయాలపై 1969లోనే ఉద్యమం భగ్గుమంది.

మిగతా 3లో..


## రాయదుర్గం భూమ్



- వేలంలో ఎకరం ధర రూ.204 కోట్లు పలికింది
- ఈ వేలం ద్వారా రూ.1,000 కోట్లకు పైగా ఆదాయం
- రెండు విడతల్లో కలిపి రూ.2,500 కోట్ల ఆదాయం
- రెండ్రోజుల క్రితం ఎకరం రూ.237 కోట్ల గరిష్ట ధరను తాకింది
- రియల్ ఎస్టేట్ జోరుతో భూములకు విపరీతమైన డిమాండ్
- రాయదుర్గం, నార్సింగిలో భూముల ధరలకు రెక్కలు

03

## ఇకపై ప్రతి నెలా నోటిఫికేషన్లు



- ప్రతి నెలా 2-3 నోటిఫికేషన్ల విడుదల
- ఇకపై అన్ని పరీక్షలు కంప్యూటర్ ఆధారితమే
- లీకేజీలకు తావులేకుండా పకడ్బందీ సాంకేతికత
- ఫలితాల జాప్యం తగ్గి, నియామకాలు త్వరగా
- ప్రతిభే ప్రామాణికంగా ఎంపిక ప్రక్రియ
- అభ్యర్థులు డిజిటల్ పరీక్షా విధానానికి అలవాటు పడాలి

02

## రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి

రాష్ట్రంలో తడిసిన ధాన్యానికి పూర్తి మద్దతు ధర



04

## రైస్ మిల్లర్లతో రేవంత్ సర్కార్ కుమ్మక్కు

- ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైంది
- పంట వివరాలు కేంద్రానికి పంపడంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం
- ఒత్తిడి వల్లే ప్రభుత్వం కొనుగోళ్లు మొదలుపెట్టింది
- ఆవిర్భావ వేడుకలు ఢిల్లీలో బీజేపీ ఆధ్వర్యంలో
- తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు
- ఈటలపై పోస్టర్లు పార్టీ కుట్ర మాత్రమే

02



## బీజేపీ ఏజెంట్ పవన్ కల్యాణ్

- తెలంగాణను వ్యతిరేకించిన పవన్, ముందు క్షమాపణ చెప్పాలి
- ఏపీలో ఏమీ చేయలేని పవన్, తెలంగాణలో సభ పెట్టడం విడ్డూరం
- పవన్ బీజేపీ అజెండాతో విద్వేషాలు రెచ్చగొడుతున్నారు
- సొంత రాష్ట్రంలో గెలవలేని పవన్, ఇక్కడ ఉద్ధరిస్తాననడం హాస్యాస్పదం
- మీ సభలను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పెట్టరు?
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను సహించం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ గడ్డపై పవన్ కల్యాణ్ తలపెట్టిన నవ నిర్మాణ సభ వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో నిప్పులు చెరుగుతోంది. ఏపీ డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కల్యాణ్, ఒకప్పుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించి, ఆ క్రమంలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన తీరును మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేళ, ఈ పవిత్రమైన రోజునే ఇక్కడ సభ నిర్వహించడం అంటే అది మన రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని ఆయన మండిపడ్డారు. తెలంగాణ ఏర్పడితే తాను 11 రోజులు అన్నం మానేశానని స్వయంగా ప్రకటించుకున్న పవన్,

మిగతా 2లో..






## బీజేపీ బీఆర్ఎస్ పొత్తు..!

- రాబోయే ఎన్నికల్లో బీజేపీ-బీఆర్ఎస్ పొత్తు ఖాయం
- అవినీతి కేసులపై కేంద్రం ఎందుకు జాప్యం చేస్తోంది?
- రైతు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కేంద్రానికి డిమాండ్
- 2034 వరకు తెలంగాణలోనే కొనసాగుతాను
- హరీష్ బీజేపీలోకి వెళ్తున్నారని సంచలన ఆరోపణ
- 2028లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ధీమా

03

# తల తాకట్టు పెట్టయినా ఇళ్లు కడతాం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తల తాకట్టు పెట్టయినా పేదల సొంతింటి కలను నిజం చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గంభీరంగా ప్రకటించారు. కొమురం భీం అసిఫాబాద్ జిల్లా అడవుల గర్భంలో గిరిజన పల్లెలకు కొత్త కళ తెస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఆ ప్రాంత ప్రజల హృదయాలను గెలుచుకున్నాయి. అసిఫాబాద్ మండలం కొౌరి కొత్తగూడలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సీఎం, రెండో విడత గృహనిర్మాణ కార్యక్రమానికి సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరించి అభివృద్ధికి దిక్సూచిగా నిలిచారు. గిరిజన ప్రాంతాల్లోని ఏ గూడెంలో కూడా గుడిసెలు ఉండకూడదన్న సంకల్పంతో ఆయన ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షల యాభై వేల ఇళ్లను నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి పెద్దపీట వేస్తూ వందల కోట్ల రూపాయల పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెబుతూనే, ఆదివాసీల కోసం అదనంగా ఇరవై ఒక్క వేల ఇళ్లను కేటాయిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో ప్రజాపాలన ప్రగతి సభలో ఆయన ప్రసంగిస్తున్నప్పుడు గిరిజన బిడ్డల కళ్లలో కొత్త ఆశలు వెల్లివిరిశాయి. అర్హులైన పేదలకు గూడు కల్పించడం ద్వారానే నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని ఆయన నమ్మారు. పరిపాలనలో పారదర్శకత పాటిస్తూ, ప్రతి రూపాయిని పేదల సంక్షేమానికే ఖర్చు చేస్తున్నామని వివరించారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లను నేడు లాంఛనంగా మంజూరు చేశారు. పేదల సొంతింటి కల సాకారంలో భాగస్వాములను చేయడం పట్ల మంత్రి గర్వం వ్యక్తం చేశారు. కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్స్‌లో నిర్వహించిన భారీ సభలో ఆయన మాట్లాడుతూ దేశానికే తెలంగాణ ఒక దిక్సూచిగా మారుతోందని పేర్కొన్నారు. కేవలం రెండున్నర సంవత్సరాల స్వల్ప వ్యవధిలోనే రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షల



యాభై వేల ఇళ్లను మంజూరు చేసిన ఘనత ప్రస్తుత ప్రభుత్వానికే దక్కుతుంది. ఇప్పటికే ఒక లక్షా ఇరవై ఐదు వేల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మరో రెండు నెలల వ్యవధిలోనే రెండు లక్షల ఇళ్లను సిద్ధం చేస్తామని మంత్రి వెల్లడించారు. తండాలు, గూడాలు అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో గిరిజన, లంబాడి ప్రజలకు పూర్తిస్థాయి భరోసా కల్పిస్తున్నామని మంత్రి వివరించారు. మొదటి విడతలో ఆదివాసీ, గిరిజన, లంబాడి ప్రజలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి మూడు వేల ఐదు వందల ఇళ్లను కేటాయించాము. గిరిజన ప్రాంతాల్లో నివసించే ప్రతి పేదవాడికి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం ఇచ్చిన ఆదేశాల మేరకు అదనంగా మరో వెయ్యి ఐదు వందల ఇళ్లను మంజూరు చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంది. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి వెలుగులు నింపేందుకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది. ఈ గృహనిర్మాణ పథకంలో కులం, మతం, పార్టీల ప్రసక్తి లేకుండా కేవలం అర్హతనే ప్రాతిపదికగా తీసుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. పేదవాడు అర్హుడైతే చాలు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఈ పథకం ఒకటి రెండు విడతలతో ముగిసిపోయేది కాదని, ప్రతి అర్హ పేద కుటుంబానికి ఇల్లు అందే వరకు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ఆయన భరోసా ఇచ్చారు. రెండవ విడతలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి రెండు వేల ఐదు వందల ఇళ్లను కేటాయించడం జరిగింది. ప్రతి అర్హ కుటుంబానికి న్యాయం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. గత పాలనలో నిలిచిపోయిన గృహ నిర్మాణాలు పూర్తి చేసుకునే వారికి కూడా ఈ విడతలో ఆర్థిక సహకారం అందించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఇది పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న సానుకూల దృక్పథానికి నిదర్శనం. భవిష్యత్తులో మూడవ, నాలుగవ విడతల్లో కూడా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన హామీ ఇచ్చారు. నిజాన్ని నిర్భయంగా ఒప్పుకుని ప్రతిపక్ష నాయకులు కూడా ఈ పథకాన్ని ప్రశంసించడం అభినందనీయం అని మంత్రి పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణం ద్వారా పేదల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్నదే ప్రభుత్వ దృఢ నిశ్చయం. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో గృహ ప్రవేశాల మహోత్సవం కనులపండువగా జరిగింది. కెరమెరి మండలం కొౌరి గ్రామంలో లక్ష ఇళ్ల గృహప్రవేశం కార్యక్రమాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. పేదల కళ్లలో ఆనందం చూసినప్పుడు వచ్చే తృప్తి వెలకట్టలేనిదని ఆయన భావించారు. ప్రతి ఇంటి నిర్మాణం వెనుక ఒక కుటుంబ ఆశయం దాగి ఉందని, దానిని సాకారం చేసేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వులు చూస్తుంటే ప్రభుత్వానికి మరింత ఉత్సాహం వస్తోంది. గృహప్రవేశాల సందడితో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఆదిలాబాద్ జిల్లాకు వందల కోట్ల నిధులు మంజూరు చేయడం ద్వారా ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇందిరమ్మ ఇళ్లతో పాటు మౌలిక వసతులు కల్పించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. ముఖ్యమంత్రి అసిఫాబాద్ పర్యటన గిరిజన ప్రాంతాల సమస్యలను పరిష్కరించేందుకు ఒక మార్గదర్శకంగా నిలిచింది. గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి అమలు చేస్తోంది. స్థానిక ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం ద్వారా అభివృద్ధి పనుల్లో వేగం పెంచే అవకాశం దక్కింది. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గృహ నిర్మాణ రంగంలో వచ్చిన మార్పులు విప్లవాత్మకంగా ఉన్నాయి. లబ్ధిదారుల ఎంపిక నుంచి నిర్మాణం వరకు అన్ని దశల్లో పారదర్శకత పాటిస్తున్నాము. ఆధునిక సాంకేతికతను జోడించి గృహ నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేస్తున్నాము. పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే కాకుండా, వారికి కనీస వసతులు కల్పించడంలో ఏమాత్రం రాజీ పడటం లేదు. అన్ని ప్రాంతాల ప్రజలకు సమాన అభివృద్ధి ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాము. ప్రజాశక్తిని నమ్మి పనులు చేస్తున్నాము. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అనేది కేవలం గోడల కట్టడం మాత్రమే కాదు, పేదవాడి ఆత్మగౌరవాన్ని కాపాడటం. కుటుంబాలు సంతోషంగా ఉండేందుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలతో కూడిన ఇళ్లను నిర్మిస్తున్నాము. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి సమానంగా అందేలా చర్యలు తీసుకుంటూనే, వారికి కావాల్సిన ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తున్నాము. భవిష్యత్తులో ఈ గృహనిర్మాణ కార్యక్రమం యావత్ భారతదేశానికే ఆదర్శంగా నిలిచిపోతుందనే విశ్వాసం కలుగుతోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యం.

## వ్యవసాయ కార్మికుల జీవితాల్లో మార్పు లేదు

- **వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ విమర్శ**
- **పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీల వేతనాలు పెరగడం లేదని ఆవేదన**
- **పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**



**విశాలభారతి , సత్తుపల్లి:** పాలకులు మారుతున్నా వ్యవసాయ కార్మికుల జీవితాల్లో ఆశించిన మార్పు రావడం లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం సత్తుపల్లి ప్రజా సంఘాల కార్యాలయంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి మండల కమిటీ సమావేశం దాట్ల రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ, పెరిగిన ధరలకు అనుగుణంగా వ్యవసాయ కార్మికుల వేతనాలు పెరగడం లేదని, యాంత్రికరణ కారణంగా కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని తెలిపారు. వ్యవసాయ కార్మికులు తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి రూ.12 వేలు అందజేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు.సత్తుపల్లి మండల పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో ఇంటి స్థలాలు లేని పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. పట్టణంలో ఉన్న టింబర్ డిపో స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు ఇంటి స్థలాలుగా పంపిణీ చేయాలని సూచించారు. అలాగే నిరుపయోగంగా ఉన్న పాత ఎన్టీఆర్ కాలువను సింగరేణి మట్టితో పూడ్చి ఇళ్ల స్థలాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా 25వ మహాసభలు ఈ నెల 10వ తేదీన ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామంలో జరగనున్నాయని, ఆ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కువ్వారపు లక్ష్మణరావు, మండల కమిటీ సభ్యులు బెజవాడ లక్ష్మీనారాయణ, అయినంపూడి సనందరావు, బండి వేలాద్రి, ఎలగం రాములు, సప్పిడి భాస్కర్, దేవళ్ల రామారావు, కావూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లతో రేవంత్ సర్కార్ కుమ్మక్కు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాలు రోజురోజుకీ వేడెక్కుతున్నాయి. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై బీజేపీ సీనియర్ నాయకులు రాంచందర్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, రైస్ మిల్లర్లతో కుమ్మక్కై సామాన్య రైతు పొట్టగొడుతున్నారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. చివరి గింజ వరకు కొంటామని గొప్పలు చెప్పుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఆచరణలో మాత్రం అట్టర్ ఫ్లాప్ అయ్యారని విమర్శలు చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం వల్ల రైతులు రోడ్లపై పడిగాపులు కాయాల్సి వస్తోందని, వారి కన్నీళ్లు త్వరలోనే ప్రభుత్వానికి శాపంగా మారుతాయని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై క్లారిటీ ఇస్తూ రాంచందర్‌రావు కీలక విషయాలు వెల్లడించారు. వడ్లను నేరుగా కేంద్రం కొనదని, ఆయా రాష్ట్రాలు సేకరించిన ధాన్యానికి సంబంధించి ఖర్చులను రీయింబర్స్‌మెంట్ మాత్రమే చేస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రాథమిక విషయం కూడా తెలియకుండా కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా ధాన్యం సేకరించడంలో విఫలం కావడం వల్లే నేడు తెలంగాణలోని కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొండల్లా పేరుకుపోయిందని తెలిపారు. బీజేపీ నిరంతర ఆందోళనల వల్ల మాత్రమే ప్రభుత్వం కొద్దిగానైనా స్పందించి లారీలను పంపుతోందని, లేదంటే రైతులు ఇంకా దారుణమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చేదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్ర వీడి రైతులకు బాసటగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీ వేదికగా మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై మాటల దాడి కొనసాగించారు. పంట దిగుబడికి సంబంధించిన ముందస్తు సమాచారాన్ని కేంద్రానికి సమర్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు విఫలమైందో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని నిలదీశారు. సరైన ప్రణాళిక లేకపోవడం వల్లనే సీజన్ ముగుస్తున్నా ధాన్యం కొనుగోలు ప్రక్రియ అస్తవ్యస్తంగా




సాగుతోందని విమర్శించారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేంద్రంపై నెపం నెట్టడం పరిపాటిగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర కమిటీలలో తెలంగాణ నుంచి ఎవరిని పంపాలనే విషయంపై బీజేపీ హైకమాండ్ త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటుందని, పార్టీ అధిష్ఠానం తెలంగాణ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ మరింత బలోపేతం కానుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సంబంధించి కీలక ప్రకటన చేశారు రాంచందర్‌రావు. రేపు ఢిల్లీలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు జాతీయ స్థాయి నేతలు హాజరవుతారని, ఇది తెలంగాణపై కేంద్రానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తుందని పేర్కొన్నారు. కేవలం రాష్ట్రంలోనే కాకుండా దేశ రాజధానిలో కూడా వేడుకలు నిర్వహించడం ద్వారా తెలంగాణ గొప్పతనాన్ని చాటిచెప్పాలని తాము భావిస్తున్నామని చెప్పారు. ఈ ఆవిర్భావ వేడుకలు తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందనే సంకేతాన్ని అందిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో సమానంగా తెలంగాణను కూడా ప్రగతి పథంలో తీసుకెళ్లడమే తమ లక్ష్యమని వివరించారు. దక్షిణాది రాష్ట్రాల్లో అధికార పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా బీజేపీ జాతీయ నాయకత్వం వ్యూహరచన చేస్తోందని తెలిపారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో బీజేపీ జెండా ఎగరవేసే దిశగా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రజల్లోకి వెళ్లాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ చేరవేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నామని చెప్పారు. అధికార పార్టీల అవినీతి, అరాచకాలను ఎండగడుతూ ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఆయా రాష్ట్రాల్లో బలమైన శక్తిగా ఎదిగేందుకు జాతీయ నాయకత్వం చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తుందని, రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయభేరి మోగించడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ఈటల రాజేందర్‌పై వెలసిన పోస్టర్ల వివాదంపై స్పందిస్తూ పార్టీలో అంతర్గత కలహాలు లేవని తేల్చిచెప్పారు. బీజేపీని బలహీనపరిచేందుకు, నాయకుల మధ్య చిచ్చుపెట్టేందుకు ఎవరో ఆకతాయిలు చేసిన పని ఇదని మండిపడ్డారు. గ్రూపు రాజకీయాలను సృష్టించాలని చూస్తున్న వారి కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, చౌకబారు రాజకీయాలు తమ పార్టీలో చెల్లవని హెచ్చరించారు. పోస్టర్లు అతికించిన వారిపై ఇప్పటికే డీజీపీ, సిటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశామని చెప్పారు. పార్టీ క్రమశిక్షణే తమ బలం, ఎవరూ పార్టీ గీత దాటకూడదని ఆయన గట్టిగా హెచ్చరించారు. పార్టీ నాయకులందరూ ఒకే తాటిపై ఉండి రాబోయే సవాళ్లను ఎదుర్కొంటారని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నిరంతరం ఎండగడుతూనే ప్రజల పక్షాన పోరాడుతామని రాంచందర్‌రావు పునరుద్ఘాటించారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదిగేందుకు క్షేత్రస్థాయిలో బలోపేతం అవుతున్నామని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల సహకారాన్ని అందిస్తోందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం దానిని వాడుకోవడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. అభివృద్ధి అనేది కాగితాల మీద, ప్రకటనలకే పరిమితం కాకూడదని, క్షేత్రస్థాయిలో కనిపిస్తేనే ప్రజలు నమ్ముతారని పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే అది బీజేపీతోనే సాధ్యమవుతుందని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని వెల్లడించారు. రైతుల సంక్షేమం కోసం తమ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. ఏ చిన్న సమస్య వచ్చినా సరే పోరాటాలకు సిద్ధమని, రైతులను ఇబ్బందులకు గురిచేసే ప్రతి చర్యను అడ్డుకుంటామని తెలిపారు.

# ఇకపై ప్రతి నెలా నోటిఫికేషన్లు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలోని నిరుద్యోగ యువతకు, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఆశగా ఎదురుచూస్తున్న అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఒక సరికొత్త భరోసాని ఇచ్చింది. రాష్ట్రంలోని ఉద్యోగాల భర్తీ విషయంలో ఇకపై ఎటువంటి జాప్యం ఉండదని, నిరంతరాయంగా నోటిఫికేషన్ల పరంపర సాగుతుందని కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం ప్రకటించిన తీరు అభ్యర్థులలో నూతన ఉత్సాహాన్ని నింపుతోంది. పరిపాలనాపరమైన ఇబ్బందులను అధిగమిస్తూ, ప్రభుత్వ యంత్రాంగం వేగంగా అడుగులు వేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాబోయే రోజుల్లో ప్రతి నెలా రెండు నుండి మూడు నోటిఫికేషన్లను విడుదల చేస్తామని ఆయన స్పష్టం చేయడంతో, నిరుద్యోగుల కలలు సాకారం అయ్యే సమయం ఆసన్నమైందనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ ప్రణాళికలో భాగంగానే మంగళవారం నాడు మూడు నోటిఫికేషన్లను విడుదల చేయడమే కాకుండా, ఈ నెలలోనే మొత్తం ఐదు నుండి ఆరు నోటిఫికేషన్లను జారీ చేయడానికి టీజీపీఎస్సీ సర్వసిద్ధంగా నిలిచింది. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖలలో ఉన్న ఖాళీలపై కమిషన్ లోతైన విశ్లేషణ చేసింది. రిక్రూట్‌మెంట్ల ప్రక్రియలో ఉన్న క్షేత్రస్థాయి వాస్తవాలను వెల్లడిస్తూ, బుర్రా వెంకటేశం కొన్ని ఆసక్తికరమైన గణాంకాలను పంచుకున్నారు. ప్రస్తుతం సుమారు 28 కేటగిరీలలో ఒక్కొక్కటి చొప్పున మాత్రమే ఖాళీలు ఉండటం, అలాగే మరో 25 కేటగిరీలలో ఐదు కంటే తక్కువ ఉద్యోగాలకు మాత్రమే అవకాశం ఉండటం గమనించదగ్గ విషయం. ఖాళీల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, అభ్యర్థుల ఆశలను నెరవేర్చడంలో మరియు ప్రతిభావంతులను ఎంపిక చేయడంలో కమిషన్ ఎటువంటి రాజీ పడటం లేదు. తక్కువ పోస్టులు ఉన్నప్పటికీ, వాటిని సకాలంలో భర్తీ చేయడం ద్వారా పరిపాలనా వ్యవస్థలో నిరంతర ప్రవాహం ఉండేలా కమిషన్ వ్యూహరచన చేస్తోంది. ఎంపిక ప్రక్రియలో పారదర్శకత అనేది అత్యంత ప్రధానమని, దీనిని ప్రాధాన్యతగా తీసుకుని వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగ నియామక ప్రక్రియను ఆధునీకరించే క్రమంలో టీజీపీఎస్సీ తీసుకుంటున్న కీలక నిర్ణయాలు పోటీ పరీక్షల రంగంలో పెద్ద మార్పునకు నాంది పలుకుతున్నాయి. దశాబ్దాలుగా నడుస్తున్న ఓఎంఆర్ విధానం నేటి డిజిటల్ యుగానికి అనుగుణంగా లేదని కమిషన్ గుర్తించింది. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో భాగంగా, ఇకపై జరగబోయే రిక్రూట్‌మెంట్ పరీక్షలన్నింటినీ కంప్యూటర్ ఆధారిత ఫార్మాట్‌లోనే నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మార్పు వల్ల అభ్యర్థులు తమ పరీక్షా విధానంలో భారీగా సిద్ధం కావాల్సి ఉంటుంది.



రాత పరీక్షల స్థాయి నుండి డిజిటల్ పరీక్షల స్థాయికి మారుతున్న నేపథ్యంలో, అభ్యర్థులు డిజిటల్ అక్షరాస్యతను మరియు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పరీక్షా కేంద్రాల్లో ఒత్తిడిని తగ్గించి, పకడ్బందీగా నిర్వహణ చేపట్టేందుకు ఈ కంప్యూటరైజేషన్ ఎంతో దోహదపడుతుందని కమిషన్ నమ్మకంతో ఉంది. సాంకేతికపరమైన ఆధునీకరణ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం పరీక్షల పవిత్రతను కాపాడటమే. ఓఎంఆర్ విధానంలో ప్రశ్నాపత్రాల ముద్రణ, రవాణా, భద్రత వంటి అంశాలు ఎన్నో సవాళ్లతో కూడుకున్నవి. కానీ, కంప్యూటర్ ఆధారిత పరీక్షల ద్వారా అయితే, పరీక్ష సమయానికి సరిగ్గా గంట ముందు కూడా అత్యంత రహస్యంగా ప్రశ్నాపత్రాన్ని రూపొందించుకునే వెసులుబాటు ఉంటుందని బుర్రా వెంకటేశం వివరించారు. దీనివల్ల ప్రశ్నలు బయటకు పొక్కే అవకాశం దాదాపు శూన్యం. ఇది అభ్యర్థుల నమ్మకాన్ని పెంచడమే కాకుండా, కమిషన్ పట్ల ఉన్న గౌరవాన్ని కూడా ఇనుమడింపజేస్తుంది. గతంలో జరిగిన పరిణామాల నుండి పాఠాలు నేర్చుకున్న టీజీపీఎస్సీ, ఇటువంటి కఠినమైన చర్యల ద్వారా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు సిద్ధమైంది. అభ్యర్థులు ఇకపై తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పూర్తి పారదర్శకమైన వాతావరణంలో పరీక్షలు జరుగుతాయని కమిషన్ భరోసా ఇస్తోంది. ఈ మార్పు వల్ల మరొక ముఖ్యమైన ప్రయోజనం ఫలితాల విడుదల వేగం. సాధారణంగా పరీక్ష రాసిన తర్వాత ఫలితాల కోసం నెలల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. కానీ సీబీటీ విధానంలో పరీక్ష పూర్తయిన వెంటనే అభ్యర్థులు తమ స్కోర్ తెలుసుకునే సదుపాయం ఉంటుంది. దీనివల్ల తదుపరి నియామక దశలకు వెళ్లడంలో ఎటువంటి జాప్యం ఉండదు. ఫలితాల ప్రకటనలో పారదర్శకత పాటించడం ద్వారా, ప్రతిభ కలిగిన అభ్యర్థులకు అన్యాయం జరగకుండా చూడటం సాధ్యమవుతుంది. ప్రక్రియలో జాప్యాన్ని నివారించడం ద్వారా, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను సకాలంలో భర్తీ చేయవచ్చని కమిషన్ భావిస్తోంది. గతంలో జరిగిన పరీక్షల్లో ఫలితాల జాప్యం వల్ల ఎంతోమంది యువత ఆవేదనకు గురయ్యేవారు. ఆ బాధను గుర్తించిన కమిషన్ ఇప్పుడు వేగవంతమైన ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తోంది. నేటి తరానికి స్మార్ట్‌ఫోన్లు, టెక్నాలజీపై అవగాహన ఎంత ఉందో, ఉద్యోగ పరీక్షల్లో కూడా అదేస్థాయి టెక్నాలజీని ప్రవేశపెట్టడం హర్షించదగ్గ పరిణామం. కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు అలవాటు పడటం ద్వారా అభ్యర్థులు కేవలం ఉద్యోగం సాధించడమే కాకుండా, పరిపాలనా రంగంలోకి ప్రవేశించినప్పుడు డిజిటల్ నైపుణ్యాలను సులభంగా అందిపుచ్చుకోగలరు. రాబోయే రోజుల్లో ప్రతి నోటిఫికేషన్ కూడా ఇదే విధానంలో ఉంటుందని, కాబట్టి అభ్యర్థులు ఇప్పటి నుండే సీబీటీ విధానంపై పూర్తిస్థాయిలో కసరత్తు చేయాలని సూచించారు. మార్కెట్‌లో లభించే మాక్ టెస్టులు మరియు ఆన్‌లైన్ ప్రాక్టీస్ సెషన్ల ద్వారా అభ్యర్థులు తమ వేగాన్ని, ఖచ్చితత్వాన్ని పెంచుకోవచ్చు. పాత తరహా పద్ధతులకు స్వస్తి పలికి, కొత్త విధానాలను అందిపుచ్చుకోవడం ద్వారానే విజయ తీరాలను చేరుకోవడం సాధ్యమవుతుంది. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని అద్భుతంగా వినియోగించుకోవాల్సిన సమయం ఇది. అటు కమిషన్ కఠినంగా సంస్కరణలను అమలు చేస్తూ, ఇటు వేగంగా నోటిఫికేషన్లను విడుదల చేస్తూ యువతకు పెద్దపీట వేస్తోంది. లక్షల మంది పోటీపడే పరీక్షల్లో ప్రతిభే ప్రామాణికంగా నిలుస్తుంది కాబట్టి, సన్నద్ధతలో ఏమాత్రం లోపం లేకుండా చూసుకోవాలి. ఎప్పుడో వస్తుందో తెలియని నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసే దినాలు పోయాయి. ఇప్పుడు టీజీపీఎస్సీ ఇచ్చిన క్లారిటీతో, అభ్యర్థులు ఒక క్రమశిక్షణతో కూడిన ప్రణాళికను రూపొందించుకోవచ్చు. ప్రతి నెలా వచ్చే అవకాశాలను బట్టి ఏ పరీక్షకు ఎలా సిద్ధమవ్వాలో, ఏయే అంశాలపై పట్టు సాధించాలో నిర్ణయించుకుని ముందుకు సాగడం ఉత్తమమైన పద్ధతి. లక్ష్యాన్ని చేరుకోవాలంటే నిరంతర కృషితో పాటు, మారుతున్న టెక్నాలజీతో అడుగులో అడుగు వేయడం తప్పనిసరి. ప్రభుత్వ ఉద్యోగం అనేది కేవలం ఉపాధి మాత్రమే కాదు, సమాజానికి సేవ చేసే ఒక గొప్ప అవకాశం. అటువంటి అవకాశం కోసం అభ్యర్థులు చేసే కృషికి కమిషన్ తగిన గౌరవం ఇస్తోంది. పారదర్శకత, వేగం, నాణ్యత అనే మూడు సూత్రాల మీద కమిషన్ ఇప్పుడు పనిచేస్తోంది.

# బీజేపీ ఏజెంట్ పవన్ కల్యాణ్

**మొదటిపేజీ తరువాయి**

ఇప్పుడు అదే నేల మీద కన్నీరు కారుస్తూ డ్రామాలకు తెరలేపడం హాస్యాస్పదమని పొన్నం విమర్శించారు. గతంలో తెలంగాణ వాసుల కళ్ల దిష్టి వల్లే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోయాయని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ ప్రజల మదిలో మంటలు పుట్టిస్తున్నాయని పొన్నం గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి మన ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టేలా వ్యవహరిస్తుంటే, తెలంగాణ రక్తం పంచుకుపుట్టిన ఏ బిడ్డ కూడా ఆ సభకు వెళ్లరని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా సభలు పెట్టుకోవచ్చనే కనీస అవగాహన తమకు ఉందని, అయితే తెలంగాణ ఆవిర్భావ వేడుకల నడుమ, రాష్ట్ర అస్థిత్వాన్ని దెబ్బతీసేలా సభలు నిర్వహించడాన్ని మాత్రం ఎంతమాత్రం సహించేది లేదని ఆయన హెచ్చరించారు. పవన్ కళ్యాణ్ అడుగుజాడల వెనుక బీజేపీ ఎజెండా స్పష్టంగా కనిపిస్తోందని ఆయన ఆరోపణలు చేశారు. ఏపీలో డిప్యూటీ సీఎంగా ఉండి, అక్కడ చేయాల్సిన అభివృద్ధిని పక్కన పెట్టి, ఇక్కడికి వచ్చి నవ నిర్మాణ సభలు పెట్టడం అంటే కన్న తల్లికి గాజులు కొనలేని వాడు, పినతల్లికి ఒడ్డాణం చేయిస్తానన్న సామెతను గుర్తు చేస్తోందని పొన్నం ఎద్దేవా చేశారు. అసలు ఆంధ్రప్రదేశ్‌లో చేయలేని నిర్మాణం, తెలంగాణలో ఎలా చేయగలరని ఆయన నిలదీశారు. తన సినిమా నటనతో డబ్బులు ఇస్తే ఎవరి కోసమైనా పనిచేస్తారని విమర్శించిన పొన్నం, పవన్ కళ్యాణ్ బీజేపీ రెమ్యునరేషన్ తీసుకునే ఈ చర్యలకు పూనుకున్నారని మండిపడ్డారు. కొండగట్టు అంజన్న సాక్షిగా తాను బీజేపీ నుంచి డబ్బులు తీసుకోవడం లేదని పవన్ కళ్యాణ్ ప్రమాణం చేయగలరా అని ఆయన సవాల్ విసిరారు. తెలంగాణ వాతావరణాన్ని కలుషితం చేసేందుకు బీజేపీతో లోపాయికారీ ఒప్పందం చేసుకుని పవన్ కళ్యాణ్ ఈ విద్వేష రాజకీయాలకు తెరలేపారని మంత్రి ధ్వజమెత్తారు. సినిమాల్లో పవన్ నటనను అభిమానించే వారంతా, తెలంగాణ అస్థిత్వం మీద జరుగుతున్న దాడిని కూడా గమనించాలని ఆయన కోరారు. అణువణువునా తెలంగాణ వ్యతిరేకతను నింపుకున్న పవన్ కల్యాణ్, మొదట ఇక్కడి ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే ఇతర విషయాల గురించి మాట్లాడాలని ఆయన డిమాండ్ చేశారు. 2014లో తాను ఎంపీగా ఉన్నప్పుడే పవన్ ఇక్కడికి వస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించిన విషయాన్ని ఈ సందర్భంగా పొన్నం గుర్తు చేశారు. హైదరాబాద్‌లో పవన్ కళ్యాణ్ నవ నిర్మాణ సభ పేరుతో చేస్తున్న హడావిడి వెనుక ఉన్న అసలు ఆంతర్యం బీజేపీకి తెలంగాణను తాకట్టు



పెట్టడమేనని ఆయన ప్రశ్నించారు. ఏపీ ప్రజలు ఆశీర్వదించి అధికారం ఇస్తే, అక్కడ మీరు చేయాలనుకున్న నవ నిర్మాణం చేసి చూపించండి కానీ, ఇక్కడ విద్వేషాలను ఎందుకు రెచ్చగొడుతున్నారని నిలదీశారు. నిజంగానే నవ నిర్మాణం చేయాలనే సంకల్పం ఉంటే, బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లలో సభలు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. తన బాస్ ప్రధాని మోదీని మెప్పించడం కోసమే తెలంగాణలో సభలు పెట్టి ఇక్కడ ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. బీజేపీ డైరెక్షన్‌లో విద్వేషాలు రెచ్చగొట్టి, తెలంగాణలో వైషమ్యాలు సృష్టించాలనుకుంటే దాన్ని ఏమాత్రం ఉపేక్షించేది లేదని పొన్నం స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఒరగబెట్టింది ఏమీ లేదని, అందుకే ఇప్పుడు పవన్ కల్యాణ్‌ను అడ్డుపెట్టుకుని దొడ్డిదారిన రాజకీయాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఏపీ ప్రజల పట్ల తమకు ఎప్పుడూ గౌరవం, ప్రేమ ఉంటాయని, మనమంతా భారతీయులమని, పరస్పరం గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. మనకు ఇతర రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌తో మంచి సంబంధాలు ఉండాలని తాము కోరుకుంటున్నామని, విద్వేషపూరిత రాజకీయాలు మాత్రం వద్దని ఆయన స్పష్టం చేశారు. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ప్రతి తెలంగాణ బిడ్డకు అత్యంత పవిత్రమైన రోజు అని, దీనిని అందరూ పండగలా జరుపుకుంటామని పొన్నం వెల్లడించారు. ఎంతో పోరాటం, త్యాగాల పునాదుల మీద ఏర్పడిన ఈ రాష్ట్రాన్ని గౌరవించుకోవడం మన బాధ్యతని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలను, పోరాట యోధులను గుర్తించేందుకు తమ ప్రభుత్వం ఇప్పటికే కమిటీ వేసి ముందుకు వెళ్తోందని ఆయన తెలిపారు. ఆ మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ వంటి వ్యక్తులు ఇక్కడ రాజకీయాలు చేస్తామంటే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని, ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరించే వారికి తగిన గుణపాఠం తప్పదని పొన్నం హెచ్చరించారు. తన మాటలతో తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసినందుకు పవన్ కల్యాణ్ పశ్చాత్తాపం చెందాలని, ఆ తర్వాతే ఏవైనా సభలు పెట్టుకోవాలని ఆయన పట్టుబట్టారు. తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతినే ఏ చర్యను కూడా ప్రభుత్వం సహించేది లేదని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

# నవతెలంగాణ 12 ఏళ్ల సంబురం

సదాశివపేటకు చెందిన 17 ఏళ్ల విద్యార్థి శంకర్ తొలి దశ ఉద్యమంలో అసువులు బాసి, మొదటి అమరుడిగా చరిత్రలో నిలిచారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి దిగ్గజాలు మంత్రి పదవులకు రాజీనామాలు చేసి ఉద్యమానికి ఊపిరిపోశారు. నాటి పోరాట తీవ్రత రాజకీయ కుట్రల వల్ల తగ్గినట్లు అనిపించినా, ప్రజల గుండెల్లో నిప్పురవ్వలు మాత్రం అలాగే రగిలాయి. ఆ నిప్పురవ్వలే మలిదశ ఉద్యమానికి పునాదిగా మారాయి. కొత్త శతాబ్దంలో 2001 ఏప్రిల్ 27న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం ఉద్యమానికి కొత్త దిశానిర్దేశం చేసింది. 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదం మారుమోగింది. ఉద్యమం కేవలం రాజకీయ చర్చగా కాకుండా, ప్రతి గడపను తాకిన ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంది. ప్రత్యేక రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా సాగిన పోరాటంలో అలుపెరగని నాయకత్వం, ప్రజల నాడిని పట్టుకుని ఉద్యమాన్ని జాతీయ స్థాయిలో చర్చనీయాంశం చేసింది. తెలంగాణ ఆకాంక్ష బలమైన శక్తిగా ఎదిగి, రాజకీయ



సమీకరణాలను శాసించే స్థాయికి చేరుకుంది. ప్రజల చైతన్యానికి నిదర్శనంగా నిలిచింది. 2009 నవంబర్ 29న చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఉద్యమ గమనాన్ని మలుపు తిప్పింది. 'తెలంగాణ వచ్చుడో.. సచ్చుడో' అనే గర్జనలతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చింది. క్రమంలో కాసోజు శ్రీకాంతాచారి, సిరిపురం యాదయ్య వంటి వారి ఆత్మబలిదానాలు ఉద్యమానికి ప్రాణం పోశాయి. వీరి త్యాగాలు తెలంగాణ సమాజంలో అమితమైన చైతన్యాన్ని నింపాయి. చివరకు 2013 అక్టోబర్ 3న కేంద్ర మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం, ఆపై పార్లమెంటులో సుదీర్ఘ ప్రక్రియల తర్వాత 2014 ఫిబ్రవరిలో బిల్లు ఆమోదం పొందడం చారిత్రక ఘట్టం. ఎన్నో ఆటంకాలు ఎదురైనా, త్యాగాల స్ఫూర్తితోనే ఉద్యమం విజయ తీరాలకు చేరుకుంది. 2014 జూన్ 2న తెలంగాణ స్వరాష్ట్రంగా ఆవిర్భవించిన వేళ, ఆనందం మాటల్లో చెప్పలేనిది. నాటి నుండి ప్రతి ఏటా జూన్ 2ను ఆవిర్భావ దినోత్సవంగా ఘనంగా జరుపుకుంటున్నాం. అమరవీరుల స్మారకం వద్ద నివాళులు అర్పించడం, జాతీయ జెండాను ఎగురవేయడం కేవలం ఆచారం కాదు, పోరాట చరిత్రను స్మరించుకునే పర్వం. పన్నెండేళ్ల ప్రయాణంలో రాష్ట్రం ఎన్నో మైలురాళ్లను అధిగమించింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, విద్యుత్ రంగంలో అద్భుత ప్రగతి, పరిపాలనా వికేంద్రీకరణతో జిల్లాల పునర్వ్యవస్థీకరణ వంటివి తెలంగాణ పురోగతిని దశదిశలా చాటిచెప్పాయి. కేవలం భౌతికమైన అభివృద్ధి మాత్రమే కాదు, ఆత్మగౌరవంతో కూడిన పురోగతి. మలిదశ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన 1200 మందికి పైగా అమరుల త్యాగఫలం నేటి నవ తెలంగాణ. కానిస్టేబుల్ కిష్టయ్య, వేణుగోపాల్ రెడ్డి, యాదిరెడ్డి వంటి వారి స్ఫూర్తి, ప్రతి విద్యార్థి, నిరుద్యోగి చూపిన పట్టుదల వల్లే కల సాకారమైంది. వీరి బలిదానాలు ఉద్యమాన్ని ఉధృతం చేసి, చివరికి స్వరాష్ట్ర ఏర్పాటుకు దారి తీశాయి. ప్రస్థానం సమున్నతమైనది. గడిచిన కాలంలో ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలు భావి తరాలకు దిక్సూచిగా నిలుస్తాయి. అమరుల ఆశయాలకు అనుగుణంగా, అభివృద్ధిలో రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలవాలి. వారి త్యాగాలను స్మరించుకోవడం అందరి ప్రాథమిక బాధ్యత. పరిపాలనా సంస్కరణలు, సాంకేతికతను జోడించి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాదులు వేశాయి. విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల్లో అద్భుతాలు సృష్టిస్తూ, ప్రతి పౌరుడికి ఆత్మగౌరవం కల్పించడమే లక్ష్యం. సామాజిక న్యాయం, ఆర్థిక అభివృద్ధి, సాంస్కృతిక వైభవం కలిసినప్పుడే తెలంగాణ నిజమైన పురోగతిని చూస్తుంది. నాటి కదలిన లక్షలాది గొంతుకలు, నేడు ప్రగతి బాటలో మరింత వేగంగా అడుగులు వేయాలి. గతాన్ని గౌరవిస్తూ, భవిష్యత్తును బంగారుమయం చేసుకోవడం ముందున్న ప్రధాన కర్తవ్యం. వినూత్న ఆలోచనలతో యువత ముందుకు రావాలి. రాష్ట్రం పన్నెండవ ఏట అడుగుపెట్టిన తరుణంలో, సాధించిన ప్రగతిని సమీక్షించుకుంటూ, లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలి. ఉద్యమ సమయంలో ఉన్న పట్టుదల, క్రమశిక్షణతో రాష్ట్ర నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి కూడా అందేలా చూడటం ప్రభుత్వాల, ప్రజల బాధ్యత. తెలంగాణ కీర్తిని దశదిశలా చాటిచెప్పే దిశగా, వారసత్వాన్ని కాపాడుకుంటూ ముందుకు దూసుకుపోవాలి. నవ తెలంగాణలో ప్రతి ఒక్కరూ గర్వంగా జీవించేలా, అభివృద్ధి పథంలో ప్రస్థానం నిరంతరం కొనసాగాలి. ప్రతి అడుగులోనూ తెలంగాణ బిడ్డల ఆత్మవిశ్వాసం ప్రతిబింబించాలి. త్యాగధనుల ఆశయాలను స్మరించుకుంటూ, ఉమ్మడి రాష్ట్ర వివక్షను అధిగమించి సాధించుకున్న స్వరాజ్యాన్ని కాపాడుకోవడం కనీస ధర్మం. సాహసోపేతమైన నిర్ణయాలు, పట్టుదల కలిగిన నాయకత్వం, ప్రజల భాగస్వామ్యంతోనే తెలంగాణ ప్రగతి పథంలో దూసుకుపోతుంది. త్యాగాల పునాదులపై నిర్మితమైన తెలంగాణ, అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలవాలి. గతం పాఠం నేర్పితే, వర్తమానం బాధ్యతను గుర్తుచేస్తోంది. బంగారు తెలంగాణ నిర్మాణం వైపు ప్రయాణం అప్రతిహతంగా సాగాలి. భవిష్యత్తు తరాలకు అందించే గొప్ప బహుమతి ప్రగతిశీల తెలంగాణ మాత్రమే. జై తెలంగాణ!

# ఉద్యోగుల బదిలీలపై మళ్లీ నిషేధం

**మొదటిపేజీ తరువాయి**

ఇప్పుడు హఠాత్తుగా తెరపడటంతో చాలామంది ఉద్యోగుల్లో అయోమయం మొదలైంది. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం, క్రమశిక్షణతో కూడిన పద్ధతిలో సాగాలని ఆశిస్తోంది. మే నెల మొత్తం హడావుడితో గడిచిన ఉద్యోగ ప్రపంచం, జూన్ ఒకటి నుండి పూర్తిగా కొత్త రూల్స్‌లోకి ప్రవేశించింది. ఈ ఆంక్షలు ఆరు నెలల పాటు కొనసాగుతాయని స్పష్టమైన సంకేతాలు వెలువడ్డాయి. నిబంధనలను అతిక్రమిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ప్రభుత్వ ఉన్నతాధికారులు ముందే హెచ్చరించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ తాజా నిర్ణయం వెనుక లోతైన విశ్లేషణ ఉంది. మే నెలలో బదిలీల కోసం ఇచ్చిన వెసులుబాటు ముగియగానే, పరిపాలనలో స్థిరత్వం తీసుకురావాలని సీఎం ప్లాన్ చేస్తున్నారు. ఆరు నెలల కఠిన ఆంక్షలు అంటే కేవలం బదిలీలు నిలిపివేయడమే కాదు, క్షేత్రస్థాయిలో పనితీరు మెరుగుపరచడమే ముఖ్య ఉద్దేశ్యం. ఎవరైనా బదిలీల కోసం పైరవీలు చేయడం వంటి పద్ధతులకు స్వస్తి పలకాలని ప్రభుత్వం భావిస్తోంది. గత నెలలో చోటు చేసుకున్న బదిలీల ప్రక్రియలో కొన్ని లోపాలు కూడా ప్రభుత్వ దృష్టికి వచ్చాయి. ఆ లోపాలను సరిదిద్దుకుంటూ, భవిష్యత్తులో పారదర్శకమైన బదిలీ విధానాన్ని రూపొందించడానికి ఈ గడువును ఒక అవకాశంగా వాడుకుంటున్నారు. అన్ని శాఖల కార్యదర్శులకు ఇప్పటికే ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. ఈ నిషేధం కేవలం సాధారణ బదిలీలకు మాత్రమే పరిమితం కావడం విశేషం. ప్రమోషన్లు రావడం, పోస్టులు రద్దు కావడం, డెప్యుటేషన్లు పంపడం లేదా క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం వంటి ప్రత్యేక పరిస్థితుల్లో బదిలీలు అనివార్యం కావచ్చు. అలాగే సుదీర్ఘ కాలం పాటు సెలవుల్లో ఉండి విధుల్లోకి తిరిగి చేరిన వారికి కూడా మినహాయింపులు లభిస్తాయి. కానీ, ఈ మినహాయింపులను వాడుకునేటప్పుడు కూడా ప్రభుత్వం చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. కేవలం ఖాళీగా ఉన్న పోస్టుల్లో మాత్రమే వీరికి చోటు కల్పించాలి తప్ప, ఉన్నవారిని బయటకు పంపి ఆ స్థానాలను భర్తీ చేసే పద్ధతి ఇక కుదరదు. ఇలాంటి చిన్న చిన్న మార్పులు చేయడం వల్ల సిస్టమ్ మీద ఒత్తిడి తగ్గుతుందని ప్రభుత్వ ఆలోచన. అత్యవసర పరిస్థితుల్లో బదిలీలు చేయాల్సి వస్తే, ఆ ఫైల్ నేరుగా ముఖ్యమంత్రి టేబుల్‌కు వెళ్లాల్సిందే. సీఎమ్ ప్రత్యేక అనుమతి లేనిదే ఏ బదిలీ ఉత్తర్వు చెల్లదు. ఇది బదిలీల విషయంలో జరుగుతున్న రాజకీయ లేదా అనవసరపు వత్తిళ్లను పూర్తిగా నిరోధిస్తుందని భావిస్తున్నారు. ఎవరైనా సరే, సొంత నిర్ణయాలతో బదిలీలు చేసేయడానికి వీల్లేదు. ప్రతి చిన్న బదిలీ వెనుక ఆర్థిక శాఖ యొక్క క్లియరెన్స్ ఉండాలని ప్రభుత్వం కచ్చితంగా ఆదేశించింది. దీనివల్ల ఆర్థిక భారం పడకుండా ఉండటంతో పాటు, అనవసరమైన పోస్టుల సృష్టిని కూడా అరికట్టవచ్చు. ప్రభుత్వ యంత్రాంగం ఇకపై మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఈ నిర్ణయం సూచిస్తోంది. ప్రస్తుత స్థానంలో కనీసం ఒక సంవత్సరం సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు మాత్రమే బదిలీల విషయంలో ప్రాధాన్యత ఇస్తారు. ఇది కేవలం పద్ధతి కోసం పెట్టిన రూల్ కాదు, ఉద్యోగి పనితీరును అంచనా వేయడానికి ఒక కొలమానం. ఏడాది నిండకుండానే బదిలీ కావాలని కోరుకోవడం, లేదా బదిలీ చేయించడం ఇప్పుడు అసాధ్యం. కారణాలు ఎంత బలంగా ఉన్నా సరే, ఈ ఒక ఏడాది సర్వీస్ నిబంధనను ఎట్టి పరిస్థితుల్లోనూ సడలించేది లేదని స్పష్టమైంది. ఏదైనా ప్రత్యేక కారణాలు ఉంటే, ఆ ఫైల్ ఆర్థిక శాఖ వరకు వెళ్లి, అక్కడ ఆమోదం పొందితేనే అది అమలులోకి వస్తుంది. సరైన కారణాలు లేని ఏ ఫైల్ కూడా ముందుకు కదలదు. ఒకవేళ ఈ నిబంధనలను అతిక్రమించి, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బదిలీలు చేస్తే, సదరు ఉద్యోగుల జీతాల బిల్లులను ఆపేయడం ఖాయం. ఇది చాలా కఠినమైన నిర్ణయం. జీతాల బిల్లుల విషయంలో ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఈసారి అప్రమత్తంగా ఉంటుంది. నిబంధనల ఉల్లంఘన జరిగితే, సంబంధిత డిడిఓ బాధ్యత వహించాల్సి ఉంటుంది. శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక సెల్ కూడా ఏర్పాటు చేశారు. నిబంధనల అమలులో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి పనిచేయడమే ఉద్యోగులకు ఏకైక మార్గం. మే నెలలో జరిగిన బదిలీల ప్రక్రియ ఒక ముగింపునకు వచ్చింది. మే 31 నాటికి ఆ గడువు పూర్తయింది. ఒక నెల రోజుల పాటు బదిలీల కోసం ఇచ్చిన అవకాశాన్ని ఎంతమంది సద్వినియోగం చేసుకున్నారో, ఎంతమందికి అది సాధ్యపడలేదో లెక్కలు తేలుతున్నాయి. ఇప్పుడు జూన్ ఒకటి నుంచి కొత్త అధ్యాయం మొదలైంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న అలజడి తగ్గి, పాలనలో క్రమశిక్షణ పెరుగుతుందని ఆశిస్తున్నారు. రాబోయే ఆరు నెలల వరకు ఎలాంటి ప్రతిపాదనలను కూడా ప్రభుత్వం స్వీకరించదు. దయచేసి ఎవరూ బదిలీల కోసం అభ్యర్థనలు పంపవద్దని కోరుతున్నారు. ఈ విరామ సమయం పాలనాపరమైన సంస్కరణలకు పునాది కావాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోంది. అందరికీ తెలిసినట్లుగా, ప్రభుత్వ ఉద్యోగంలో బదిలీలు అనేది ఎప్పుడూ ఒక చర్చనీయాంశమే. అయితే, ఈసారి ప్రభుత్వం చాలా పకడ్బందీగా ఈ జీవోను అమలు చేస్తోంది. సిస్టమ్‌లో పారదర్శకత రావాలంటే, ఇలాంటి ఆంక్షలు అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా, ఈ ఆరు నెలల కఠిన నిబంధనలు పనిచేస్తాయని నమ్మకం ఉంది. అందరూ ఈ ఆదేశాలను గౌరవించి, తమ తమ కార్యాలయాల్లో క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని కోరుతున్నారు. నిబంధనలు దాటి వెళ్లే వారికి తావు లేదని, ఇది ఒక మెసేజ్ లాంటిదని అధికారులు భావిస్తున్నారు. ఈ నిర్ణయం రాష్ట్ర పాలనా వ్యవస్థను గాడిలో పెడుతుందని ఆశించవచ్చు. ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పుడు తమ పోస్టింగ్‌ల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇచ్చిన గడువు ముగిసింది కాబట్టి, ప్రస్తుతానికి ఎక్కడ ఉన్నారో అక్కడే కొనసాగుతూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వెనుక ప్రజాహితం ఉంది. పాలనలో జవాబుదారీతనం పెరగడానికి ఇలాంటి కఠిన నిర్ణయాలు ఒక మెట్టుగా నిలుస్తాయి. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఏవైనా చిన్న చిన్న మినహాయింపులు ఇస్తే, అవి కూడా కేవలం అత్యవసరమైతేనే వస్తాయి.




# గో బ్యాక్ మిస్టర్ పవన్ కల్యాణ్

**మొదటిపేజీ తరువాయి**

ఆమె ఘాటుగా హెచ్చరించారు. గతంలో తమతో పెట్టుకొని ఇబ్బందులు పడ్డ విషయాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు కూడా ఇలాంటి పనులు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆమె హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు మరియు సాధన అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత గారు తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ పాలనలోని లోపాలను ఎత్తి చూపుతూ, అక్కడి నాయకులకు చురకలు అంటించారు. అసలే వానాకాలం వస్తోంది కాబట్టి, ముందుగా మీ సచివాలయంలో, మీ అమరావతిలో, ముఖ్యమంత్రి కుర్చీ కింద వాన నీళ్లు చేరకుండా చూసుకోండని కవిత ఎద్దేవా చేశారు. ప్రతి వర్షాకాలంలోనూ ఏపీ రాజధాని మునిగిపోతుండటం అక్కడి ప్రజలకు అవమానకరమని ఆమె అభిప్రాయపడ్డారు. పదమూడు ఏళ్లు గడిచినా ఒక రాజధానిని నిర్మించుకోలేని అసమర్థత ఉన్న మీరు, తెలంగాణ నవ నిర్మాణం చేస్తారా అని ఆమె ప్రశ్నించారు. మా పని మేము చక్కగా చేసుకుంటామని, అనవసరంగా ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోకుండా ముందు మీ ఇంటి పని చూసుకోండని ఆమె హితవు పలికారు. ఏపీ ప్రభుత్వ తీరుపై కవిత తీవ్ర విమర్శలు కురిపించారు. దాదాపు ఎనభై వేల ఎకరాల భూమిని సేకరించి, రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆమె ఆరోపించారు. దీనిపై తాము ఖచ్చితంగా నిలదీస్తామని ఆమె స్పష్టం చేశారు. తెలంగాణ సీఎం గారు ఏపీ నాయకుల విగ్రహాలను గౌరవంగా ఏర్పాటు చేస్తున్నట్లుగానే, ఏపీలో కూడా తెలంగాణ ఉద్యమ నాయకులు జయశంకర్ మరియు శ్రీకాంత్ చారి విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. జనసేన మరియు టీడీపీ పార్టీలు తెలంగాణ గడ్డపై విద్వేషపూరిత రాజకీయాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని, తగిన రీతిలో బుద్ధి చెబుతామని ఆమె హెచ్చరించారు. ఈ తరహా రాజకీయాలు తెలంగాణ సమాజం సహించదని ఆమె తేల్చి చెప్పారు. అక్కడేమీ చేయలేని వారు ఇక్కడ వచ్చి ఏం ఉద్ధరిస్తారని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ మంత్రులు చికిత్స కోసం హైదరాబాద్ నగరానికే వస్తున్నారంటే, గత పన్నెండు ఏళ్లుగా అక్కడ కనీస వైద్య సదుపాయాలు కల్పించలేకపోయారని స్పష్టమవుతోందని కవిత విమర్శించారు. ముందు మీ రాష్ట్రంలో మౌలిక వసతులు మరియు వైద్య వ్యవస్థను మెరుగుపరచుకున్నాక, తెలంగాణ గురించి మాట్లాడాలని ఆమె సలహా ఇచ్చారు. తెలంగాణ ఏర్పాటును నిరసిస్తూ గతంలో పదకొండు రోజులు నిరాహార దీక్ష చేశానని చెప్పిన పవన్ కల్యాణ్, ఇప్పుడు మళ్లీ ఏ ముఖం పెట్టుకొని తెలంగాణలో సభలు నిర్వహిస్తున్నారని ఆమె నిలదీశారు. తెలంగాణలో తమ పార్టీలు విస్తరిస్తాయని టీడీపీ మరియు జనసేన నేతలు చేస్తున్న ప్రకటనలను ఆమె కొట్టిపారేశారు. ఇక్కడ విస్తరించడానికి ఖాళీగా ఉన్న సామ్రాజ్యాలు లేవని, ఇది చైతన్యవంతమైన తెలంగాణ అని ఆమె గుర్తు చేశారు. ఇటీవల తెలంగాణ టీడీపీ నాయకుడొకరు చేసిన వ్యాఖ్యలపై కూడా కవిత మండిపడ్డారు. తెలంగాణ అనే పదం డిక్షనరీలోనే లేదని ఒక నేత అనడంపై ఆమె తీవ్రంగా స్పందించారు. మెడకాయ మీద తలకాయ ఉన్న ఎవరైనా ఇలాంటి అసంబద్ధమైన మాటలు మాట్లాడతారా అని ఆమె ప్రశ్నించారు. రాజ్యాంగ బద్ధంగానే మనం తెలంగాణను సాధించుకున్నామని, ఈ వాస్తవాన్ని ఎవరూ విస్మరించలేరని ఆమె చెప్పారు. తెలంగాణలో ఏపీ నుండి వచ్చిన సెటిలర్లను ఎంతో ఆప్యాయంగా చూసుకున్నామని, భవిష్యత్తులో కూడా అలాగే చూసుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు. అయితే ఇక్కడ ఆంధ్ర పాలకుల అవసరం ఏ మాత్రం లేదని, తెలంగాణ ప్రజలే తమను తాము పాలించుకుంటారని ఆమె స్పష్టం చేశారు. తెలంగాణ రక్షణ సేన నాయకులకు కవిత కీలక పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ఉద్యమకారులను ఆత్మీయంగా సన్మానించుకోవాలని ఆమె సూచించారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆమె కోరారు. ఆ పార్టీ ఏర్పాటు చేసిన కేకే కమిటీ కేవలం కాలయాపన కోసమేనని ఆమె విమర్శించారు. ఉప్పల్ భగాయత్ లో ప్రభుత్వానికి చెందిన మూడు వందల యాభై ఎకరాల భూమి ఉందని, ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంటే నెల రోజుల్లో ఆ భూమిని ఉద్యమకారులకు పంచాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జూలై రెండవ తేదీన ఆ భూములను తామే ఆక్రమించుకుని ఆవాసాలు ఏర్పాటు చేసుకుని నిరసన తెలుపుతామని ఆమె ప్రకటించారు. కేసులు ఉన్న ఉద్యమకారులకు కూడా మొదటి దశలోనే స్థలాలు కేటాయించాలని ఆమె కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం ఐదు వందల మంది వరకే పరిమితం చేసిందని, కానీ తాము పన్నెండు వందల మందికి పైగా ఉద్యమకారులను మరియు పందొమ్మిది వందల అరవై తొమ్మిది నాటి ఉద్యమకారులను కూడా గుర్తించి ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఉద్యమకారుల త్యాగాలను విస్మరిస్తే ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని వారికి న్యాయం చేయాలని ఆమె సూచించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు. తమ లక్ష్యం సాధించే వరకు వెనక్కి తగ్గేది లేదని ఆమె ధీమా వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ప్రజా సంక్షేమమే పరమావధి కావాలని కవిత ఆకాంక్షించారు. స్వప్రయోజనాల కోసం ప్రాంతీయ విభేదాలు సృష్టించడం సరికాదని ఆమె హితవు పలికారు. తెలంగాణ సమాజం ఎంతో చైతన్యవంతమైనదని, ఇక్కడ కుట్రలు సాగవని ఆమె మరోసారి హెచ్చరించారు. తన మాటల్లో కఠినత్వం ఉన్నప్పటికీ, అది తెలంగాణ ప్రయోజనాల కోసమేనని ఆమె పరోక్షంగా చెప్పారు. రాజకీయ పార్టీలు ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలే తప్ప, అధికార దాహం కోసం విద్వేషాలను పెంచకూడదని ఆమె అభిప్రాయపడ్డారు. ఇలాంటి పద్ధతులు మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని ఆమె తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే ఏ ప్రయత్నాన్ని కూడా సహించేది లేదని కవిత స్పష్టం చేశారు.



# రాయదుర్గం 'భూ'మ్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగరం నలుదిశలా విస్తరిస్తున్న క్రమంలో రాయదుర్గం ప్రాంతం రియల్ ఎస్టేట్ రంగంలో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఐటీ కారిడార్‌కు గుండెకాయగా భావించే ఈ ఏరియాలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. తాజాగా తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ నిర్వహించిన వేలం పాటలు రియల్ రంగంలో సంచలనం సృష్టించాయి. ఈ వేలంలో ఎకరం ధర రూ.204 కోట్ల మార్కును తాకడం గమనార్హం. ప్లాట్ నంబర్4 పరిధిలోని 5 ఎకరాల 9 గుంటల భూమి కోసం జరిగిన ఈ పోటాపోటీ వేలం, పెట్టుబడిదారుల ఆసక్తిని ప్రతిబింబించింది. కేవలం ఈ ఒక్క ప్లాట్ ద్వారానే సంస్థకు వేయి కోట్లకు పైగా ఆదాయం లభించింది. హైదరాబాద్ మౌలిక వసతులు అభివృద్ధి చెందుతుండటంతో గ్లోబల్ కంపెనీలన్నీ ఇక్కడ ఆఫీసుల కోసం క్యూ కడుతున్నాయి. కేవలం రెండు రోజుల క్రితం జరిగిన వేలంలో నమోదైన గణాంకాలు మరింత ఆశ్చర్యపరిచాయి. అప్పట్లో ఒక ఎకరం ధర ఏకంగా రూ.237 కోట్ల గరిష్ఠ స్థాయికి చేరింది. ఆ ఒక్క లావాదేవీతో రూ.1,490 కోట్ల భారీ ఆదాయం ప్రభుత్వానికి చేకూరింది. రెండు విడతల్లో నిర్వహించిన ఈ వేలం ప్రక్రియ ద్వారా టీజీఐఐసీ ఖజానాకు మొత్తం రూ.2,500 కోట్లు జమ అయ్యాయి. ఈ భారీ ధరలు వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా, నగరంలో పెరుగుతున్న కమర్షియల్ డిమాండ్‌ను బట్టి చూస్తే ఇదంతా సహజమేనని రియల్ ఎస్టేట్ విశ్లేషకులు చెబుతున్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్లు హైదరాబాద్‌ను తమ ప్రధాన కేంద్రంగా ఎంచుకుంటున్న వేళ, రాయదుర్గం లాంటి ప్రాంతాల్లోని భూములకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. భూమి విలువ రోజురోజుకూ పెరుగుతుండటంతో డెవలపర్ల మధ్య గట్టి పోటీ కనిపిస్తోంది. రాయదుర్గం, నార్సింగి ప్రాంతాలు ప్రస్తుతం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో హాట్ కేకుల్లా మారాయి. ఐటీ పార్కులు, మల్టీనేషనల్ కంపెనీల ఆఫీసులు, అత్యాధునిక మౌలిక వసతులు అన్నీ ఒకే చోట ఉండటం ఈ ప్రాంతానికి కలిసొచ్చే అంశం. ఇక్కడ స్థలం కొనుగోలు చేయడం అంటే భవిష్యత్తులో లాభాల పంట పండించుకోవడమేనని ఇన్వెస్టర్లు నమ్ముతున్నారు. హైటెక్ సిటీకి దగ్గరగా ఉండటం, మెట్రో కనెక్టివిటీ, కమ్యూటేషన్ సౌకర్యాలు అన్నీ అందుబాటులో ఉండటంతో ఈ ఏరియాకు విపరీతమైన క్రేజ్ పెరిగింది. అగ్రశ్రేణి ఐటీ దిగ్గజాలు ఇక్కడే ఉండటం వల్ల కార్పొరేట్ ఆఫీసుల కోసం స్థలాల వేట తీవ్రమైంది. నగరంలో గ్లోబల్ హబ్ హోదా పెరుగుతున్న కొద్దీ భూముల ధరలు ఒక పద్ధతి ప్రకారం కాకుండా వేగంగా దూసుకుపోతున్నాయి. ఇన్వెస్టర్ల దృష్టంతా ఇప్పుడు రాయదుర్గం వంటి ఏరియాల వైపే ఉంది. డెవలపర్లు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ భారీ ప్రాజెక్టులను చేపడుతున్నారు. ఈ ప్రాంతంలో ల్యాండ్ బ్యాంకులు తక్కువగా ఉండటం, డిమాండ్ రోజురోజుకూ పెరుగుతుండటంతో ధరలకు రెక్కలు వచ్చాయి. వందల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టినా, ఆ తర్వాత దక్కే ఆదాయం అంతకంటే రెట్టింపు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అందుకే వేలంలో ఎకరం ధర రూ.200 కోట్లు దాటినా, పెద్ద పెద్ద కంపెనీలు వెనక్కి తగ్గకుండా బిడ్డింగ్ చేస్తున్నాయి. వ్యాపార సామ్రాజ్యాల విస్తరణకు రాయదుర్గం ఒక కేంద్ర బిందువుగా మారుతోంది. ఇక్కడ నిర్మించే ఆఫీస్ స్పేస్‌లకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉండటమే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం. గతంలో ఎన్నడూ లేని విధంగా నగరం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను అందుకుంటోంది. మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రియల్ ఎస్టేట్ వృద్ధికి ఊతమిస్తున్నాయి. ఓఆర్ఆర్ పరిధిలో భూముల ధరలు అమాంతం పెరిగిపోవడానికి ఇప్పుడు రాయదుర్గం ప్రధాన నిదర్శనంగా నిలుస్తోంది. ఇక్కడ జరుగుతున్న ప్రతి ల్యాండ్ డీల్ ఒక కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేస్తోంది. రియల్ ఎస్టేట్ రంగంలో జరుగుతున్న ఈ మార్పులు కేవలం నగరానికే పరిమితం కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతున్నాయి. టీజీఐఐసీ నిర్వహిస్తున్న ఈ వేలాల ద్వారా ప్రభుత్వానికి వస్తున్న వేల కోట్ల రూపాయలు, మళ్లీ ఇతర అభివృద్ధి పనులకు ఉపయోగపడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల మెరుగుదలకు ఈ ఆదాయం ఒక ఆక్సిజన్‌లా పనిచేస్తుంది. రాయదుర్గం వేలం పాటల ద్వారా వస్తున్న ఈ భారీ సొమ్ము, రియల్ మార్కెట్‌లో నగరం ఎంతటి పవర్‌ఫుల్ ప్లేయర్‌గా ఎదిగిందో నిరూపిస్తోంది. భూమి విలువ పెరుగుతుంటే దాని ప్రభావం చుట్టుపక్కల ప్రాంతాలపై కూడా పడుతోంది. ఒకప్పుడు కేవలం ఐటీ కంపెనీలకే పరిమితమైన రాయదుర్గం, ఇప్పుడు మల్టీ పర్పస్ కమర్షియల్ హబ్‌గా రూపాంతరం చెందింది. లగ్జరీ హోటళ్లు, ప్రీమియం ఆఫీస్ స్పేస్‌లు, కమర్షియల్ మాల్స్ నిర్మాణానికి డెవలపర్లు ప్రాధాన్యత ఇస్తున్నారు. పెరిగిన ధరలను తట్టుకుని కూడా నిర్మాణాలు చేపడుతున్నారంటే, ఇక్కడ భవిష్యత్తులో ఎంతటి లాభాలు ఉన్నాయో సులభంగా అర్థం చేసుకోవచ్చు. హైదరాబాద్ నగరం గ్లోబల్ ఇన్వెస్టర్ల ఫేవరెట్ డెస్టినేషన్‌గా మారడం వల్ల, రాయదుర్గం భూముల ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే మరిన్ని రికార్డులు నమోదయ్యే అవకాశం ఉంది. నగర అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, ఈ ప్రాంతాన్ని అత్యంత విలువైనది.

# బీజేపీ బీఆర్ఎస్ పొత్తు..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయ రణరంగం రసవత్తరంగా మారుతోంది. దశాబ్ద కాలంగా అలుపెరుగని పోరాటాలు, విశ్లేషణలకు తావునిచ్చిన రాష్ట్ర రాజకీయ సమీకరణాలు ఇప్పుడు సరికొత్త మలుపు తిరుగుతున్నాయి. అధికార మార్పిడి తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలు రాష్ట్ర భవిష్యత్తును పూర్తిగా మార్చేసేలా ఉన్నాయి. ఇప్పటివరకు రాష్ట్రంలో త్రిముఖ, బహుముఖ పోటీల వాతావరణం నెలకొనగా, రాబోయే రోజుల్లో ఆ పరిస్థితి పూర్తిగా మారుతుందనే చర్చ జోరుగా సాగుతోంది. ఓట్ల విభజన జరగకుండా, వ్యతిరేకతను ఏకం చేసి, ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తు చేసేందుకు ప్రధాన పార్టీలు అప్పుడే పావులు కదుపుతున్నాయి. 2028 ఎన్నికల సమరానికి ఇప్పుడే పునాదులు పడుతుండటం, రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. ముఖ్యంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య తెరవెనుక సాగుతున్నట్లు భావిస్తున్న బంధంపై జరుగుతున్న చర్చ, ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజా వ్యాఖ్యలు రాజకీయ వేడిని మరింత పెంచాయి. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు భవిష్యత్తులో ఒక్కటవ్వడం ఖాయమని ఆయన బల్లగుద్ది చెబుతున్నారు. తన వద్ద దీనికి సంబంధించి పక్కా సమాచారం ఉందని, అయితే మూలాలను బయటపెట్టడం నైతికత కాదని ఆయన స్పష్టం చేశారు. కేవలం ఊహాగానాలు మాత్రమే కాకుండా, గత ఎన్నికల ఫలితాలు, క్షేత్రస్థాయిలో ఆయా పార్టీల తీరు తెన్నులను విశ్లేషిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని ఆయన వాదిస్తున్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనేందుకు ఆ రెండు పార్టీలు చేతులు కలపడం తప్పనిసరని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో ఓటు బ్యాంకును కాపాడుకుంటూనే, ప్రతిపక్ష స్థానాన్ని పదిలం చేసుకునే క్రమంలో ఈ రెండు పార్టీలు పరస్పర సహకారం కోసం చూస్తున్నాయని రేవంత్ రెడ్డి బలంగా నమ్ముతున్నారు. ఇక కేంద్రం వైఖరిని రేవంత్ రెడ్డి పదునైన పదాలతో విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై ప్రాథమిక ఆధారాలతో కూడిన ఫైళ్లను సీబీఐకి పంపినా, ఎందుకు విచారణ జరగడం లేదని ఆయన ప్రశ్నిస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఉద్దేశించి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. విచారణలో ఎందుకు జాప్యం జరుగుతోందో చెప్పాలని, కేంద్రం ఎందుకు సీబీఐని పంపడం లేదని ఆయన నిలదీశారు. తెలంగాణలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కేంద్రంతో పోరాడుతూనే, మరోవైపు కేంద్రంలోని పెద్దల వైఖరిని ఎండగట్టడంలో రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.




ధాన్యం కొనుగోలు వంటి అంశాల్లో కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత కిషన్ రెడ్డి తీసుకోవాలని, లేదంటే రైతుల పక్షాన నిలబడాలని ఆయన సూచిస్తున్నారు. రాజకీయ భవిష్యత్తుపై రేవంత్ రెడ్డి స్పష్టమైన సంకేతాలిచ్చారు. తాను 2034 వరకు తెలంగాణ రాజకీయాల్లోనే ఉంటానని, ప్రజలకు మేలు చేసే వరకు విశ్రమించేది లేదని ఆయన తేల్చిచెప్పారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌తో కలిసి తాను అనుసరిస్తున్న వ్యూహం సక్సెస్ అవుతుందని, వచ్చే 2028 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. పీసీసీలో సమన్వయం, ప్రభుత్వంలో వేగం ఈ రెండింటిని బ్యాలెన్స్ చేస్తూ, కాంగ్రెస్ పార్టీని తిరుగులేని శక్తిగా మార్చేందుకు రేవంత్ రెడ్డి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. తనపై వస్తున్న విమర్శలను కూడా అంతే ధీటుగా ఎదుర్కొంటున్నారు. బీఆర్ఎస్ అగ్రనేత హరీష్ రావుపై రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి. హరీష్ రావు బీజేపీతో టచ్‌లో ఉన్నారని, పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారని రేవంత్ రెడ్డి బాంబు పేల్చారు. దీనికి సంబంధించి ఎవరితో సంప్రదింపులు జరుపుతున్నారో తనకు తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై కేసీఆర్ మీద ఒట్టు పెట్టి చెప్పాలని సవాలు విసరడంతో పరిస్థితి మరింత వేడెక్కింది. బీఆర్ఎస్ పార్టీని వీడే ఆలోచన లేదని హరీష్ రావు ఖండించినప్పటికీ, రేవంత్ రెడ్డి విసిరిన ఈ సవాలు ఆ పార్టీలో అంతర్గతంగా కలకలం రేపింది. అధికార పార్టీ వ్యూహాత్మకంగా విసిరిన ఈ పాయింట్, బీఆర్ఎస్ వర్గాల్లో అభద్రతా భావాన్ని పెంచుతోంది. ప్రత్యర్థి పార్టీల్లోని కీలక నేతలను ఉక్కిరిబిక్కిరి చేయడం ద్వారా, రాజకీయంగా పైచేయి సాధించేందుకు రేవంత్ రెడ్డి వేస్తున్న ముందడుగు ఇది. హరీష్ రావు ఖండన తర్వాత కూడా, ఈ చర్చ ఆగిపోలేదు. రాజకీయాల్లో ఏది అసాధ్యం కాదని, ఆయా పార్టీల అవసరాలను బట్టి సమీకరణాలు మారుతుంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు. తన రాజకీయ ప్రస్థానం బీఆర్ఎస్ పునాదుల మీదనే జరిగిందని, తాను ఆ పార్టీని విడిచిపెట్టే ప్రసక్తే లేదని హరీష్ రావు స్పష్టం చేసినా, రాజకీయ వర్గాల్లో దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్తులో ఆ పార్టీల మధ్య జరగబోయే పొత్తుల గురించి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు, కేవలం వ్యూహాత్మకమైనవని ఒక వర్గం చెబుతుంటే, ఇందులో ఏదో నిజం లేకపోలేదని మరొక వర్గం అంటోంది. రాబోయే ఎన్నికల నాటికి ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలు ఏ మలుపు తిరుగుతాయో అన్నది ఇప్పుడు ఆసక్తికరమైన అంశంగా మారింది. రాజకీయాల్లో ఇప్పుడు జరుగుతున్న ఈ పరిణామాలు, సాధారణ ఓటర్లలో కొత్త చర్చకు దారితీస్తున్నాయి.

# నిషేధిత వేళల్లో పాన్ షాప్ నిర్వహణ.. యజమానికి జైలు

**హయత్‌నగర్ పోలీసుల కఠిన చర్య – కోర్టు ఆదేశాలతో చెర్లపల్లి జైలుకు తరలింపు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్:** నిషేధిత సమయాల్లో పాన్ షాప్ నిర్వహిస్తూ పోలీసు నిబంధనలను ఉల్లంఘించిన వ్యక్తిని హయత్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రెండు రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. హయత్‌నగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జీ స్కూల్ ప్రాంతానికి చెందిన సయ్యద్ ఇమ్రాన్ రహీమ్ (35) అనే వ్యక్తి నిషేధిత సమయాల్లో పాన్ షాప్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు నిందితుడిపై సెక్షన్ 21/76 సీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, ఎస్‌టీసీ నంబర్ 3411/2026 కింద గౌరవనీయులైన 9వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయమూర్తి ఆద్ల భరత్ రెడ్డి నిందితుడికి రెండు రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పోలీసులు అతడిని చెర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలు, పోలీసు శాఖ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యాపారులు నిర్ణీత సమయాల్లోనే తమ దుకాణాలను నిర్వహించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయని, ప్రజలు చట్టాలను గౌరవించి పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రైవేట్ బస్సు కండక్టర్ అప్రమత్తత

- **పద్దెనిమిది కిలోల గంజాయి పట్టివేత**
- **నగదు ప్రోత్సాహంతో కండక్టర్‌ను అభినందించిన కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్**



**ప్రైవేట్ ట్రావెల్స్ కండక్టర్ శ్రీకాంత్ సన్మానిస్తున్న డిసిపి రితిరాజ్**

**సైబరాబాద్ విశాల భారతి:** ప్రజల సహకారం ఉంటే నేరాలను అరికట్టడం సులభమని నిరూపిస్తూ ప్రైవేట్ ట్రావెల్స్ బస్ కండక్టర్ అప్రమత్తతతో భారీ గంజాయి రవాణా గుట్టురట్టయింది. ఈ ఘటన వివరాలను కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ వెల్లడించారు.మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలో ఆరుగురు వ్యక్తులు ఔరంగాబాద్‌కు వెళ్తున్నామంటూ షిర్డీ బస్సులో ఒక లగేజీ బ్యాగ్ ఎక్కించేందుకు ప్రయత్నించారు. బ్యాగ్‌పై అనుమానం వచ్చిన కండక్టర్ శ్రీకాంత్ వారిని ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పకుండా వారు పరారయ్యారు. వెంటనే అప్రమత్తమైన శ్రీకాంత్ ఆ బ్యాగ్‌ను మియాపూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు అప్పగించారు. పోలీసులు పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి బ్యాగ్‌ను తెరచి చూడగా అందులో పద్దెనిమిది కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీని మార్కెట్ విలువ దాదాపు ఇరవై లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పరారైన ఆరుగురు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.సమాజ భద్రత పట్ల బాధ్యతగా వ్యవహరించి గంజాయి పట్టుబడేలా చేసిన కండక్టర్ శ్రీకాంత్‌ను కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ శాలువాతో సత్కరించి నగదు ప్రోత్సాహకం అందజేశారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, మియాపూర్ ఏసీపీ రమేష్, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్సై మధు, సిబ్బంది పాల్గొన్నారు.

# వెరిఫికేషన్ పేరుతో వల కొరియర్ ఫోన్‌తో లక్షల స్వాహా

- **సైబరాబాద్ పోలీసుల దెబ్బకు చిక్కిన బెంగాల్ సిమ్ స్వాప్ ముఠా**



**సైబరాబాద్విశాల భారతి:** ఈ సిమ్ స్వాప్ మోసం వివరాలను సైబరాబాద్ సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. సిటీబ్యాంక్ ప్రెస్టీజ్ క్రెడిట్ కార్డ్ డివిజన్ నుంచి మాట్లాడుతున్నామంటూ ఫోన్ కాల్ చేసి, ఈసిమ్‌ను ఫిజికల్ సిమ్‌గా మార్చాలని, అది డీఓటీ వెరిఫికేషన్‌కు తప్పనిసరి అంటూ నిందితులు నమ్మబలికారు. నమ్మిన బాధితులు కొరియర్‌లో వచ్చిన కొత్త ఫోన్‌లో సిమ్ పెట్టారు. అంతే, క్షణాల్లో బ్యాంకు ఖాతాల్లోని సొమ్ము మాయమైంది. ఇలా విషింగ్, సిమ్ స్వాప్ ద్వారా డెబ్బై ఏడు లక్షలకు పైగా కొట్టేసిన అంతర్రాష్ట్ర ముఠా గుట్టును సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రట్టు చేశారు.నిందితులు ముందుగానే హానికరమైన యాప్‌లు ఇన్‌స్టాల్ చేసిన మొబైల్ ఫోన్లను కొరియర్ ద్వారా బాధితులకు పంపారు. ఆ ఫోన్లలో సిమ్ కార్డు పెట్టగానే బ్యాంకుల నుంచి వచ్చే ఓటీపీలు, అలర్ట్‌లు నేరుగా నిందితులకు చేరేలా సెట్ చేశారు. దీంతో బాధితుడి అనుమతి లేకుండానే ఖాతాల్లోకి లాగిన్ అయి ఆన్‌లైన్ లావాదేవీలు జరిపి లక్షలు కాజేశారు. ఈ భారీ మోసంపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు అంతర్రాష్ట్ర ముఠాలోని ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు సెలిమ్ మొండల్ పశ్చిమ బెంగాల్ నదియా జిల్లా పండిటాపూర్‌కు చెందిన వ్యక్తి. సెల్ ఫోన్ షాప్ నడిపే అతన్ని ట్రాన్సిట్ వారెంట్‌పై అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడి నివాసం నుంచి ఏడు లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసులో ఇంతకుముందే మరో ఇద్దరు నిందితుల నుంచి పదిహేను లక్షలు రికవరీ చేశారు.సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో బీఎన్‌ఎస్, ఐటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఫోన్‌లో ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు, సిమ్ సంబంధిత సమాచారం ఎవరికీ చెప్పవద్దని, గుర్తుతెలియని కొరియర్ ఫోన్లలో సిమ్ కార్డులు అస్సలు పెట్టవద్దని పోలీసులు పౌరులను హెచ్చరిస్తున్నారు. ఒక్క నిర్లక్ష్యం లక్షలు పోగొట్టే ప్రమాదం ఉందని సూచిస్తున్నారు.ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు,తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్‌లో ఫ్లైఓవర్ పనులపై సమీక్ష

**సర్వీస్ రోడ్లు, ర్యాంప్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు**

**రాజేంద్రనగర్, విశాలభారతి :** ఆరాంఘర్ చౌరస్తా నుంచి నెహ్రూ జూలాజికల్ పార్క్ వరకు కొనసాగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులను రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి సమీక్షించారు. సోమవారం ఉదయం ఆయన అధికారుల బృందంతో కలిసి ఫ్లైఓవర్ కింద ఇరువైపుల ఉన్న సర్వీస్ రోడ్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్లైఓవర్ కింద నిర్మాణంలో ఉన్న సర్వీస్ రోడ్లు, ర్యాంప్ పనుల పురోగతిని ఆయన ఆరా తీశారు. కొన్ని ప్రాంతాల్లో పనులు నెమ్మదిగా సాగుతున్నట్లు గమనించిన కమిషనర్, పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు రాకపోకల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా పనులు నిర్వహించాల్సిందిగా సూచించారు. ప్రత్యేకంగా వర్షాకాలం దృష్ట్యా రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా తగిన డ్రైనేజ్ సదుపాయాలను ఏర్పాటు చేయాలని, పనుల్లో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలిక మార్గాలను సక్రమంగా నిర్వహించాలని కూడా ఆదేశించారు. ఈ తనిఖీలో ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం, యూబీడీ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ మరోసారి స్పష్టం చేశారు.



# ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- **అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ స్కీమ్, పిల్లల విద్యకు ఫీజు రాయితీలు కల్పించాలి**
- **టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా సమావేశంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏకగ్రీవ తీర్మానాలు**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్:**



రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించడంతో పాటు అక్రిడిటేషన్ కార్డులు, ఆరోగ్య భద్రత, పిల్లల విద్యకు ఫీజు రాయితీలు కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని వి.వి. బ్యాంకెట్ హాల్లో టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు శేరిబాయి గణేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మైల సైదులు, జిల్లా కోశాధికారి శ్రీనివాస్ చారి, నేషనల్ కమిటీ సభ్యుడు దేవేందర్ ముఖ్యంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బసవ పున్నయ్య మాట్లాడుతూ.. జర్నలిస్టులు ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ సంక్షేమ పరంగా ఇంకా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం తక్షణమే వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఫీల్డ్ స్థాయిలో పని చేస్తున్న జర్నలిస్టుల విషయంలో అనవసర నిబంధనలు విధించకుండా కార్డులు జారీ చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న హెల్త్ స్కీమ్‌లో జర్నలిస్టులను కూడా చేర్చి వారికి, వారి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. జర్నలిస్టులు అనారోగ్య పరిస్థితుల్లో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించాలని కోరారు. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపుపై ప్రభుత్వం చేస్తున్న ఆలోచనను స్వాగతిస్తున్నామని, అయితే హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే జర్నలిస్టులతో పాటు రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలను కూడా సేకరించి వారికి స్థలాలు కేటాయించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సొంతింటి కలను నెరవేర్చే విధంగా ప్రభుత్వం ముందుకు రావాలని అన్నారు. జర్నలిస్టుల పిల్లల విద్యా భారం తగ్గించేందుకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు రాయితీలు తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు రాయితీలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. వెంకటేశ్, మణికుమార్, రఘునందన్ గౌడ్, సుదర్శన్ గౌడ్, శ్రీనివాస్, నర్సింహ్మ, రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యాదగిరి, జిల్లా ప్రచార కార్యదర్శి నర్సింహ్మారెడ్డి, సోషల్ మీడియా కమిటీ కన్వీనర్ పులిపలుపుల శివ కుమార్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీశైలం, అంజి, నియోజకవర్గాల అధ్యక్షులు, కార్యదర్శులు యాదగిరి, రఘువేందర్ గౌడ్, రాజు, జైచందర్, శంకర్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే జర్నలిస్టులు మల్లేష్, యాకుబ్ పాషా సహా రంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలు, నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు హాజరై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సమావేశం ముగింపులో జర్నలిస్టుల అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ఫ్యూచర్ సిటీలో ఇండ్ల స్థలాలు, పిల్లల విద్యకు ఫీజు రాయితీలు, జర్నలిస్టుల సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏకగ్రీవ తీర్మానాలు ఆమోదించారు. "జర్నలిస్టుల సంక్షేమమే ప్రజాస్వామ్య పరిరక్షణకు బలమైన పునాది" అని టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు స్పష్టం చేశారు.

# మార్కెట్ల నుండి ధాన్యాన్ని వెంటనే తరలించాలి




**సిపిఎం జిల్లా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి**

**చౌటుప్పల్ విశాలభారతి:**

ప్రభుత్వాలకు ముందు చూపు లేకపోవడంతోనే మార్కెట్లలో ధాన్యం నిల్వ ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం రోజున కందాల రంగారెడ్డి స్మారక భవనం నందు చౌటుప్పల్ మండల కమిటీకి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాగీరు కిష్టయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించగా కృష్ణా రెడ్డి. మాట్లాడుతూ..మార్కెట్ కు ధాన్యం తీసుకువచ్చి రెండు నెలలు గడుస్తున్నా కొనుగోలు కాకపోవడంతో రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అకాల వర్షాలతో మార్కెట్లో ఉన్న ధాన్యం తడిసి మొలకెత్తుతున్న పరిస్థితులు దాపురించాయని అన్నారు. ముఖ్యమంత్రి నుండి ఎమ్మెల్యే వరకు మాటలు చెబుతున్నారే తప్ప ఆచరణలో అమలు కావడం లేదని అన్నారు. ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదని అన్నారు. వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్టుగా కాంటావేసి మిల్లులకు, గోదాములకు పంపిస్తే ఈ సమస్య ఉండదని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్లు ఎన్ని రివ్యూ మీటింగ్ లు పెట్టినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తాను చేయాల్సిన పని చేయకుండా మార్కెట్లు సందర్శించడం, బాధ్యతా రాహిత్యంగా మాట్లాడడం రైతులను మోసం చేసినట్టే అవుతుందని అన్నారు. రైస్ మిల్లులలో తయారైన బియ్యాన్ని కేంద్రం సేకరించకుండా సమస్యను జఠిలం చేసి, పైగా రైతులను ఉద్ధరిస్తున్నట్టుగా చెప్పటం సిగ్గుచేటన్నారు. కేంద్రంపై ఒత్తిడి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అనాలోచితంగా ఏది తోస్తే అది మాట్లాడడం సరైంది కాదని అన్నారు. ఈసారి ధాన్యం దిగుబడి బాగా వచ్చిందని, దాని ద్వారా ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పడం అవివేకం అన్నారు. వచ్చే మూడేళ్లలో మీ ప్రభుత్వం ఉన్నా, ఏ ప్రభుత్వం వచ్చినా సాగు విస్తీర్ణం పెరిగి, ధాన్యం దిగుబడి పెరుగుతుందని అందుకు తగ్గట్టుగా ధాన్యాన్ని నిల్వ చేయడం కోసం గోదాముల నిర్మాణం చేసే విషయం మరిచిపోయి కేంద్రం మీద రాష్ట్రం, రాష్ట్రం మీద కేంద్రం మాట్లాడి తప్పించుకోవడం సరైనది కాదని అన్నారు. ఇప్పటికైనా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి గ్రామంలో అవసరాన్ని బట్టి గోదాములను నిర్మించాలని డిమాండ్ చేశారు. బస్తాకు రెండు కిలోలు అదనంగా తూకం వేసి రైస్ మిల్లర్లను సంతృప్తి పరిచినప్పటికీ పరిష్కారం కాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. లారీ కాంట్రాక్టర్లతో ఎన్ని సమీక్షలు జరిపినా లారీల కొరత ఏర్పడుతుందని ఇది ప్రభుత్వం యొక్క చేతగానితనమే అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయ యాదయ్య, చింతల సుదర్శన్, మండల కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్, అంతటి అశోక్, కొంతం సుశీల, చెరుకు లక్ష్మమ్మ ,కొండే శ్రీశైలం, మీసాల శీను పాల్గొన్నారు.

# పిగ్లీపూర్‌లో ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు



- **నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం – సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి**
- **లబ్ధిదారులకు సొంత ఖర్చులతో ఇంటి ముందు బండలు వేయించిన సర్పంచ్**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్:**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పిగ్లీపూర్ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిర్మించిన ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొదటి విడతలో మంజూరైన రెండు ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు ఆనందోత్సాహాల మధ్య గృహప్రవేశం చేసుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహాయ సహకారాలతో పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తోందని పేర్కొన్నారు. పిగ్లీపూర్ గ్రామంలో మొదటి విడతలో పంది మంజుల - రాము కుటుంబానికి, పోలే రజిత - దర్శన్ కుటుంబానికి మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు పూర్తి కావడంతో ఈరోజు గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పేద కుటుంబాలు సొంత ఇంటిలోకి అడుగుపెట్టడం గ్రామానికి గర్వకారణమని అన్నారు. అంతేకాకుండా కొత్తగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్లకు అవసరమైన ఇంటి ముందు బండలను సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి తన సొంత ఖర్చులతో వేయించడం గ్రామస్థుల ప్రశంసలు అందుకుంది. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయానికి తోడు గ్రామపంచాయతీ కూడా తమ వంతు సహకారం అందిస్తోందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ దుర్గం నరసింహ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జక్కుల శివకుమార్, జక్కుల ఝాన్సీ, ఆంజనేయులు, వర్షం లావణ్య, హనుమంతు, జక్కుల పరమేష్, పంది మురళీకృష్ణ, కొండ రమేష్, కొలను హరిణి, మహేందర్ పాల్గొన్నారు.అలాగే పిగ్లీపూర్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు హుస్సేన్, ఎర్రయ్య, అమరావతి, శ్వేత, హారిక, పిగ్లీపూర్ దేవాదాయ కమిటీ అధ్యక్షుడు వర్షం ఐలయ్య, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గృహప్రవేశం అనంతరం ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల కుటుంబాలను అభినందించి, కొత్త ఇంటిలో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం గ్రామీణ పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందని, భవిష్యత్తులో మరిన్ని అర్హ కుటుంబాలకు ఈ పథకం అందేలా కృషి కొనసాగుతుందని నాయకులు పేర్కొన్నారు.

# 32 లక్షలతో సీసీ రోడ్డు ప్రారంభం

**పరిశీలించిన మాజీ మేయర్, కాంగ్రెస్ పార్టీ నేతలు**



**బోడుప్పల్ విశాలభారతి:** బోడుప్పల్ సర్కిల్‌లో అనేక రోజులుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు త్వరలో పూర్తికానున్నాయని బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తెలిపారు. సోమవారం బోడుప్పల్‌లోని బచ్ పబ్ స్కూల్ మెడిప్లస్ నుండి అమృత బార్ వద్ద ఉన్న మెడిప్లస్ వరకు వేయనున్న కొత్త సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నేతలు, మాజీ కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందులో భాగంగా రూ. 32 లక్షల వ్యయంతో ఈ పనులను ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పీ. హరినాథ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బొమ్మకు కళ్యాణ్ కొత్త చందర్ గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, కొత్త దుర్గమ్మ, చీరాల నరసింహ, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, సుమన్ నాయక్, సీసా వెంకటేష్ గౌడ్, అలాగే కాంగ్రెస్ పార్టీ నేతలు కుర్రి శివశంకర్, అసర్ల బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

# మొయినాబాద్ ఎంపీడీవోగా హిమబిందు

**నూతన అధికారికి శుభాకాంక్షల వెల్లువ**



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా నూతనంగా నియమితులైన హిమబిందు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్థులు ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.మండల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల సంక్షేమం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎంపీడీవో కీలక పాత్ర పోషిస్తారని, హిమబిందు నాయకత్వంలో మొయినాబాద్ మండలం మరింత అభివృద్ధి చెందాలని పలువురు ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శక పరిపాలన అందించాలని, గ్రామాల అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరారు. నూతన బాధ్యతలు చేపట్టిన హిమబిందుకు మండల ప్రజలు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలియజేస్తూ ఆమె పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# కనకమామిడిలో అక్రమ మైనింగ్‌పై ప్రజావాణిలో ఫిర్యాదు

- **నేషనల్ హైవే పేరుతో కొండలను కొల్లగొడుతున్న మైనింగ్ మాఫియా అంటూ ఆరోపణలు**
- **వంద మీటర్ల లోతు తవ్వకాలపై గ్రామస్తుల ఆందోళన**
- **అక్రమ మైనింగ్ నిలిపివేయకపోతే భారీ ఆందోళనలు చేస్తామని హెచ్చరిక**




**మొయినాబాద్, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని కనకమామిడి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా మైనింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ గ్రామస్తులు, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి సోమవారం చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఏఓ ప్రభుదాస్‌కు వినతిపత్రం సమర్పించారు.వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, నేషనల్ హైవే పనుల పేరుతో గుట్టలను పూర్తిగా తవ్వి వంద మీటర్లకు పైగా లోతైన గుంతలు తీయడంతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని గ్రామస్తులు ఆరోపించారు. పేదలకు ఇండ్ల పట్టాలు కేటాయించిన సర్వే నంబర్ 51/1లో కూడా కొండలను నేలమట్టం చేస్తూ మైనింగ్ కొనసాగుతోందని తెలిపారు. అలాగే సర్వే నంబర్ 510లో అర్ధరాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా భారీ మైనింగ్ పనులు జరుగుతున్నాయని ఆరోపించారు.

**ఈ విషయమై మెగా మైనింగ్ సంస్థ మేనేజర్ రాజేందర్ రెడ్డిని**

కోరగా సరైన సమాధానం ఇవ్వకుండా, అనుమతులకు సంబంధించిన పత్రాలు చూపకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే మైనింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ వెంటనే పనులను నిలిపివేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన ఏఓ ప్రభుదాస్ స్పందిస్తూ, మొయినాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌ను ఫోన్ ద్వారా సంప్రదించి మైనింగ్ నిర్వహిస్తున్న సంస్థ వద్ద ఉన్న అనుమతులు, సంబంధిత పత్రాల పూర్తి వివరాలను వెంటనే అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. అక్రమ మైనింగ్‌ను వెంటనే నిలిపివేసి బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

# సీఎంసీ ప్రజావాణికి 60 ఫిర్యాదులు



**సైబరాబాద్, విశాల భారతి:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండే ప్రజావాణి కార్యక్రమంలో పౌరుల నుంచి 60 ఫిర్యాదులు అందాయి. ప్రజా సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పౌరుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఈరోజు టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, ఎన్నికలు, అర్బన్ బయోడైవర్సిటీ, విద్యుత్, ప్రజా సౌకర్యాలు తదితర అంశాలపై పౌరులు వినతులు అందజేశారు. స్వీకరించిన ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖకు పంపి తక్షణ చర్యలకు ఆదేశించినట్లు సీఎంసీ అధికారులు తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత కోసం ప్రతి దరఖాస్తుకు ప్రత్యేక ట్రాకింగ్ ఐడీ కేటాయించారు. దీంతో పౌరులు తమ ఫిర్యాదు పురోగతిని తెలుసుకునే అవకాశం ఉంటుంది. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని, పౌరుల సమస్యలను ప్రాధాన్యతగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. చేపట్టిన చర్యలపై ఎప్పటికప్పుడు పురోగతి నివేదికలు అందించాలని, పూర్తిస్థాయి పరిష్కారం అయ్యేవరకు పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. మండే ప్రజావాణి పౌరులు, పరిపాలన మధ్య ప్రత్యక్ష వారధిగా నిలుస్తోందని సీఎంసీ పేర్కొంది. స్థానిక సమస్యలకు వేగంగా పరిష్కారం లభించడంతో పాటు బాధ్యతాయుత పాలనకు ఈ కార్యక్రమం దోహదపడుతోందని తెలిపింది.

# 'ప్రజావాణి'లో ఆన్‌లైన్ ఫిర్యాదుకు శ్రీకారం

**ఆల్విన్ కాలనీ - విశాల భారతి**

ప్రజా సమస్యల పరిష్కారానికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 పరిధిలో 'ప్రజావాణి' కార్యక్రమంలో కీలక మార్పులు చేసింది. 2026 మే 25 సోమవారం నుంచి ఫిర్యాదులకు ఆన్‌లైన్‌లో ఐడీ జనరేషన్ విధానాన్ని ప్రారంభించింది. ప్రతి సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ప్రతి ఫిర్యాదుకు ఇకపై ప్రత్యేక ఐడీ జనరేట్ చేస్తారు. ఆ ఐడీ ద్వారా ఫిర్యాదుదారులు తమ దరఖాస్తు స్థితిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. దీంతో ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని అధికారులు తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఇ. చాముండేశ్వరి ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఐడీ జనరేట్ అయిన పత్రాలను వారికి అందజేశారు. మీ సమస్యలను ప్రజావాణిలో వినిపించండి, సమస్యల పరిష్కారానికి సహకరించండి అని ఈ సందర్భంగా ఆమె కోరారు. సర్కిల్ 51 పరిధిలో ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేసేందుకు ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



ఆల్విన్ కాలనీ సర్కిల్లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో ఆర్జీలు స్వీకరిస్తున్న డిసి

**ప్రజావాణికి రెండే ఫిర్యాదులు**

కూకట్‌పల్లి జోన్ ఆల్విన్ కాలనీ సర్కిల్ 51లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి రెండు ఫిర్యాదులు వచ్చాయి. రెవెన్యూ విభాగానికి ఒకటి, యూబీడీకి ఒకటి చొప్పున అందాయి. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, యూసీడీ, వెటర్నరీ, శానిటేషన్ విభాగాలకు ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. అందిన ఫిర్యాదులకు ఆన్‌లైన్‌లో ఐడీ జనరేట్ చేసి దరఖాస్తుదారులకు అందజేశారు. వీటిని సంబంధిత శాఖలకు పంపి త్వరగా పరిష్కరిస్తామని డిప్యూటీ కమిషనర్ ఇ. చాముండేశ్వరి తెలిపారు.

## పెట్రోల్ డీజిల్ పై వ్యాట్ తగ్గించాలి

- ఆమ్ ఆద్మీ పార్టీని రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు
- లేనిపక్షంలో జూన్ 3న నకరికల్ లో ఎడ్లబండ్లతో ర్యాలీ చేపడతాం




**ముషీరాబాద్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలో రోజురోజుకి పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ ధరలను ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలు అందకుండా పోతున్నాయని పెట్రోల్ డీజిల్ పెరుగుదలతో ఆకాశాన్ని అంటే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పెట్రోల్ డీజిల్ ధరలపై వ్యాట్ తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం లిబర్టీ లోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత ఇందన ధరల బారం సాధారణ ప్రజలు రైతులు కార్మికులు ఆటో డ్రైవర్లు చిన్న వ్యాపారులు మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక పరిస్థితిని మరింత దిగజారుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదల వల్ల ప్రజలపై పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలపై పనుల భారం మోపకుండా జీవన ప్రమాణాలు మెరుగుపరిచే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో జూన్ 3న నకరికల్ లో ఎడ్ల బండ్లతో ర్యాలీ చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రాకేష్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు నెస్ కిచెన్‌లో చిమ్నీ పేలి కలకలం






**సైబరాబాద్ విశాల భారతి:** తెలుగు నెస్ కిచెన్‌లో సోమవారం సాయంత్రం చిమ్నీ పేలి కలకలం రేగింది. చిమ్నీని చాలా కాలంగా శుభ్రం చేయకపోవడంతో అందులో పేరుకుపోయిన జిడ్డు, నూనె మసికి ఒక్కసారిగా మంటలు అంటుకుని పేలుడు సంభవించింది.పేలుడు ధాటికి కిచెన్ సామగ్రి చెల్లాచెదురైంది. రూఫ్‌టాప్‌పై అమర్చిన ఎగ్జాస్ట్ డక్ట్ నుంచి దట్టమైన పొగలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన చేరుకొని మంటలను పూర్తిగా అదుపు చేశారు.ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, ఆస్తి నష్టం స్వల్పమేనని అధికారులు తెలిపారు. చిమ్నీలు, ఎగ్జాస్ట్ సిస్టమ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ఫైర్ సిబ్బంది సూచించారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉంది.

## అమరుల త్యాగాలే మన తెలంగాణ

**పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర 12వ అవతరణ దినోత్సవం సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ రాష్ట్ర, శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, కాలనీవాసులకు శుభాకాంక్షలు తెలిపారు. అమరుల త్యాగఫలమే నేటి తెలంగాణ అని, ప్రాణత్యాగాలు చేసిన అమరులను స్మరించుకోవాలన్నారు. అమరుల త్యాగాలతో సాధించిన తెలంగాణలో ప్రతి ఒక్కరికీ సంక్షేమం, అభివృద్ధి అందిస్తామని, ప్రజల ఆశీస్సులతో అభివృద్ధి మార్క్ చేసి చూపిస్తామని గాంధీ పేర్కొన్నారు.

## బీహెచ్ఈఎల్‌అమీన్పూర్ ఫ్లై ఓవర్ పనులు షురూ




**శేరిలింగంపల్లి విశాల భారతి:** శేరిలింగంపల్లి, అమీన్పూర్ వాసుల చిరకాల కల నెరవేరనుంది. బీహెచ్ఈఎల్ చౌరస్తా నుంచి అమీన్పూర్ బంధంకొమ్ము వరకు నేషనల్ హైవేను కలుపుతూ నాలాపై ఫ్లై ఓవర్, 4 లైన్ల రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మెదక్ ఎంపీ రఘునందన్ రావు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ చొరవతో జీహెచ్ఎంసీ నిధులు మంజూరు చేసింది. గత వారం నుంచి నాలా డైవర్షన్ పనులు జరుగుతున్నాయి. సోమవారం ఎంపీ రఘునందన్ రావు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రవికుమార్ యాదవ్ పనులను పరిశీలించారు. గతంలో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేశామని, పఠాన్ చెరువు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు పనులు చేయలేదని, ఇది బీజేపీ ఎంపీల వల్లే సాధ్యమైందని రవికుమార్ యాదవ్ అన్నారు.

## ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం

**జోనల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ**

**కూకట్ పల్లి విశాల భారతి:** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కూకట్ పల్లి జోన్ జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ బుధవారం సాతవాహన నగర్‌లో ఆకస్మికంగా పర్యటించారు. స్థానికంగా నిర్వహించిన ప్లాస్టిక్ నిషేధ అవగాహన కార్యక్రమాన్ని, ప్లాస్టిక్ కవర్ల సేకరణ డ్రైవ్‌ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. టీ పాయింట్, కిరాణా దుకాణాలతో పాటు ప్రధాన రహదారుల్లో కాలినడకన తిరుగుతూ వ్యాపారులు, స్థానికులతో నేరుగా మాట్లాడారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడటం వల్ల పర్యావరణానికి, ప్రజారోగ్యానికి కలిగే నష్టాన్ని వివరించారు. పలు షాపుల్లో నిల్వ ఉన్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. వినియోగదారులకు వస్తువులు ఇచ్చేందుకు వస్త్ర సంచులు, జనపనార సంచులనే వాడాలని సూచించారు.ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 పరిధిలో ఈ డ్రైవ్ నిర్వహించారు.ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి నిషేధిత ప్లాస్టిక్ విక్రయించినా, వినియోగించినా భారీ జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ హెచ్చరించారు. 99 రోజుల పాటు నగరవ్యాప్తంగా ఇలాంటి డ్రైవ్‌లు కొనసాగుతాయని ఆయన వెల్లడించారు ఈ తనిఖీల్లో డిప్యూటీ కమిషనర్ ఇ. చాముండేశ్వరి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఘన వ్యర్థాల నిర్వహణ) వై. శంకర్ గణేష్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యూఎం) బస్సీ పాటిల్, శానిటేషన్ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ, శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ గోపాల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




## మియాపూర్ సర్కిల్‌లో ప్రజావాణి

**35 ఫిర్యాదులు, టౌన్ ప్లానింగ్‌పైనే 33**

**మియాపూర్ - విశాల భారతి:**

శేరిలింగంపల్లి జోన్, సర్కిల్ 48 మియాపూర్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 35 ఫిర్యాదులు అందాయి.డిప్యూటీ కమిషనర్ సమక్షంలో ప్రజలు తమ సమస్యలను విన్నవించారు. అందిన ఫిర్యాదుల్లో టౌన్ ప్లానింగ్ విభాగానికే అత్యధికంగా 33 ఫిర్యాదులు రావడం గమనార్హం. ఇరిగేషన్, పశుసంవర్ధక శాఖలకు ఒక్కొక్క ఫిర్యాదు చొప్పున వచ్చాయి. మిగతా విభాగాలకు ఎలాంటి ఫిర్యాదులు నమోదు కాలేదు.




**శాఖల వారీగా ఫిర్యాదుల వివరాలు:**

| శాఖ | ఫిర్యాదుల సంఖ్య |
|---|---|
| టౌన్ ప్లానింగ్ | 33 |
| సాగునీరు ఇరిగేషన్ | 01 |
| పశుసంవర్ధక శాఖ | 01 |
| రెవెన్యూ | 0 |
| ఆరోగ్యం & పారిశుధ్యం | 0 |
| యూసీడీ | 0 |
| ఇంజనీరింగ్ | 0 |
| యూబీడీ | 0 |
| ఎలక్ట్రికల్ | 0 |
| **మొత్తం** | **35** |

అందిన అర్జీలన్నింటినీ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని డిప్యూటీ కమిషనర్ ఆదేశించారు. ప్రజావాణిని ప్రతి సోమవారం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## నార్సింగిలో దళిత భూములపై బడాబాబుల కన్ను

**ప్రభుత్వ భూమిపై ఆక్రమణ యత్నం**
**బెదిరింపులకు గురవుతున్న లబ్ధిదారులు**

**రాజేంద్రనగర్, విశాలభారతి:**




నియోజకవర్గంలోని గండిపేట మండలం నార్సింగి పరిధిలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిపై అక్రమార్కుల కన్ను పడింది. గతంలో ఎస్సీ వర్గానికి చెందిన పేద దళిత కుటుంబాలకు కేటాయించిన ఈ భూమిని ఆక్రమించుకునేందుకు కొందరు బడా వ్యాపారవేత్తలు, భూకబ్జాదారులు యత్నిస్తున్న ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారి తీసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం, 1981లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నార్సింగి గ్రామానికి చెందిన 30 మంది నిరుపేద దళితులను గుర్తించి, వారి జీవనోపాధి కోసం సర్వే నంబర్ 298/Pలోని 2 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఇందులో ఒక్కొక్కరికి సుమారు 242 గజాల చొప్పున స్థలం ఇచ్చారు. ఆ స్థలంలో కోళ్ల ఫారాలను ఏర్పాటు చేయించి, ప్రభుత్వమే మూడు విడతల్లో కోడి పిల్లలను పంపిణీ చేసింది. అయితే, ఆ సమయంలో వచ్చిన తీవ్రమైన వ్యాధుల కారణంగా సుమారు 80 శాతం కోళ్లు మృతి చెందడంతో ఆ వ్యాపారం నష్టాల్లోకి వెళ్లింది. ఆర్థికంగా వెనుకబడిన లబ్ధిదారులు బ్యాంకు రుణాలను తీర్చలేకపోయారు. దీంతో కోళ్ల పెంపకం పూర్తిగా నిలిచిపోయింది. ఆ తరువాత ఆ భూమిని కాపాడుకునేందుకు లబ్ధిదారులు ఎస్సీ కార్పొరేషన్ అధికారులను సంప్రదించగా, వారి సూచనల మేరకు "ఇది ప్రభుత్వ భూమి - క్రయవిక్రయాలు నిషేధం" అనే హెచ్చరిక బోర్డును అక్కడ ఏర్పాటు చేశారు. ఇటీవలి కాలంలో నార్సింగి ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందడంతో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ నేపథ్యంలో కొంతమంది భూబకాసురులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ విలువైన భూమిపై కన్నేశారు. రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే ప్రభుత్వ హెచ్చరిక బోర్డుపై తెల్లరంగు పూసి, అందులోని అక్షరాలను చెరిపివేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. అంతేకాకుండా, ఆ స్థలానికి రాకూడదని, వస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని లబ్ధిదారులను బెదిరిస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. "ఇందిరమ్మ కాలంలో మాకు కేటాయించిన ఈ భూమే మా కుటుంబాలకు ఆధారం. ఇప్పుడు గజం భూమి వేలల్లో పలుకుతుండటంతో దాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. మమ్మల్ని భయపెడుతున్నారు" అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తమ భూమిని రక్షించడంతో పాటు, పూర్తి హక్కులు కల్పించేలా అధికారిక పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ బాధితులు సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. నార్సింగి గ్రామ ఎస్సీ లబ్ధిదారుల కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భూమికి సంబంధించిన పాత పత్రాలు, రికార్డులను అధికారులకు అందజేశారు. కబ్జాదారులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు. ఈ వినతిపత్రం సమర్పణలో దయాకర్, క్రాంతి, విశ్వనాథం, సుధీర్, విశాల్, కీర్తి, రాజ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళితుల భూమిని రక్షిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం



**విశాలభారతి, కరకగూడెం :**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తున్న సందర్భంగా, పినపాక నియోజకవర్గంలోని కరకగూడెం మండలంలో 24 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు మరియు ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవ శ్రీ పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు స్థానిక సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులతో కలిసి గృహప్రవేశం మరియు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్.. అనంతరం వారు మాట్లాడుతూ, పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమం మరియు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవ, నిరంతర కృషి వల్ల నియోజకవర్గంలో అనేక అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. అందులో భాగంగా కరకగూడెం మండలంలో 24 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు జరగడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేస్తూ, భద్రమైన గృహాలను అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాహిత పాలనకు నిదర్శనమని పేర్కొంటూ, ఈ అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీనియర్ లైబ్రరీ అసిస్టెంట్ వలి హుస్సేన్‌కు ఘన వీడ్కోలు



**రాజేంద్రనగర్, విశాలభారతి :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్ఏయూ)లోని నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్‌లో సీనియర్ లైబ్రరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వలి హుస్సేన్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ ముఖ్య అతిథిగా హాజరై వలి హుస్సేన్‌ను శాలువాతో సత్కరించి, స్మారక చిహ్నం అందజేశారు. అలాగే గ్రంథాలయ సిబ్బంది, సహచరులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. విశ్వవిద్యాలయ గ్రంథపాలకులు డాక్టర్ ఎస్.పి. రవికుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడు దశాబ్దాలకు పైగా విశ్వవిద్యాలయానికి వలి హుస్సేన్ అందించిన సేవలు విశేషమని, పని పట్ల ఆయన చూపిన అంకితభావం, నిబద్ధత ప్రతి ఉద్యోగికి ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బోధనేతర సంఘం నేతలు, లైబ్రరీ సిబ్బంది కూడా వలి హుస్సేన్ సేవలను స్మరించుకుని, ఆయనతో పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. ఆయన సహృదయత, కర్తవ్యనిష్ఠ, సహోద్యోగులతో స్నేహపూర్వక వ్యవహారం విశేషమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వలి హుస్సేన్ మాట్లాడుతూ, తనకు అప్పగించిన బాధ్యతలను తోటి ఉద్యోగుల సహకారంతో తన శక్తి మేరకు నిర్వహించగలిగానని, అందరి సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయంతో తన అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని అన్నారు. రాజేంద్రనగర్‌లోని నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వలి హుస్సేన్ కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## జోనల్ కమిషనర్‌ను కలిసిన నవజీవన్ రెడ్డి

- అభివృద్ధి పనులు వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్:** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఎల్.బి.నగర్ జోనల్ కమిషనర్‌ను వారి కార్యాలయంలో కలిసి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల పనులు, కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై జోనల్ కమిషనర్‌తో విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి, వరద నీటి కాలువల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టి, సమస్యాత్మక ప్రాంతాల్లో తక్షణ పరిష్కారాలు అమలు చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. అదేవిధంగా డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని నవజీవన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం మరియు హయత్‌నగర్ డివిజన్ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం కోసం సంబంధిత అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, ప్రజల తరఫున సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే ఉంటానని తెలిపారు. ప్రజావాణి వేదిక ద్వారా ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా వాటి పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తానని నవజీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

## నిరుపేద కుటుంబాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- విశ్వశాంతి కాలనీలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం
- అర్హులైన పేదలకు సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం – సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్:**



అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని చిన్న రావిరాల గ్రామపంచాయతీ పరిధిలోని విశ్వశాంతి కాలనీలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్, ఉప సర్పంచ్ సద్దిపల్లి శిరీష శంకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారుల కుటుంబాన్ని అభినందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తోందని అన్నారు. గతంలో సొంత ఇంటి కల నెరవేరదని భావించిన అనేక నిరుపేద కుటుంబాలకు నేడు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా న్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. సమాజంలోని బలహీన వర్గాలు, పేద కుటుంబాలు గౌరవప్రదమైన జీవనం గడపాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు గ్రామీణ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.ఉప సర్పంచ్ సద్దిపల్లి శిరీష శంకర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, నిరుపేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. గ్రామంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బండారి అనిత, ఆకిటి రామకృష్ణారెడ్డి, అభవతి బాలయ్య, రాపోలు మల్లేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కొమురెల్లి రేణుక, కడవేరు శ్రీనివాసరావు, గండికోట శారద అశోక్, గ్రామ సెక్రటరీ సునీత పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు, కాలనీ వాసులు, మహిళలు, యువకులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై గృహప్రవేశ వేడుకలను విజయవంతం చేశారు. గృహప్రవేశం అనంతరం ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, కొత్త ఇంటిలో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిరుపేదల సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు అమలు చేసి ప్రతి పేద కుటుంబానికి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించే దిశగా కృషి కొనసాగుతుందని నాయకులు పేర్కొన్నారు.

# అధికారులు ఆఫీసులో కూర్చొని నీటి లెక్కలు రాస్తే నిలదీస్తాం

- రైతులను అన్యాయం చేయాలనుకుంటే చూస్తూ ఊరుకోం
- రైతులకు నష్టపరిహారం ఆంధ్ర రైతుల కంటే ఎక్కువ ఇవ్వాలి
- విలేకరుల సమావేశంలో బీ ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:**

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల అశ్వాపురం, బూర్గంపాడు మండలంలో కొన్ని గ్రామాలు భద్రాచలం ప్రాంతం పూర్తిగా నీట మునిగే అవకాశం ఉందని బ్యాక్ వాటర్ వల్ల రైతులు, ముంపు ప్రాంతాల ప్రజలు తీవ్రంగా నష్టపోతారని బీ ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 3, 4 తేదీలలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ అధికారులు ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల బ్యాక్ వాటర్ తో జరగబోయే నష్టం పై సర్వే చేసేందుకు రానున్నట్లు తెలిపారు. అధికారులు ఏసీ రూముల్లో కూర్చొని అంచనా వేసుకొని తూ..తూ.. మంత్రంగా సర్వే చేసి రికార్డు లు రాసుకుంటే కుదరదని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో జరిగే అనర్థాలు, నష్టాలు, ప్రజల కష్టాలు అన్నీ న్యాయబద్ధంగా సవివరంగా తెలుసుకొని రిపోర్ట్ తయారు చేసి బట్టబయలు చేసి, కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రిపోర్ట్ తయారు చేయాలని సూచించారు. ఆంధ్రా ప్రాంత రైతుల కంటే ముంపు ప్రాంత రైతులకు ఎక్కువ నష్ట పరిహారం ఇవ్వాలని , కేంద్రప్రభుత్వమే నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రజల అనుమానాలు, సందేహాలు నిపుణులచే నివృత్తి చేయాలని ఒకవేళ ఈ ముంపు ప్రాంత రైతులకు అన్యాయం చేయాలని చూస్తే అందరినీ కలుపుకొని పోయి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ముంపు ప్రాంతాల పర్యవేక్షణ కమిటీ, బీ ఆర్ ఎస్ పార్టీ అధ్వర్యంలో అధికారులను కలిసి వినతి పత్రం అందించి సమస్యను వివరిస్తామని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు, రైతుల బాగు కోసం బీ ఆర్ ఎస్ పార్టీ ఏ కార్యక్రమమైన చేపట్టేందుకు సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు.

**అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్**

నమ్మి ఓటేస్తే అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆయన ఆరోపించారు. రైతుల ధాన్యం కొనే దిక్కు లేదని , ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాకు లాభం లేదని విమర్శించారు. త్వరలో మండల కమిటీలు , సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపడతామని పార్టీ బలంగా ఉందని వచ్చే ఏ ఎన్నిక అయినా బీ ఆర్ ఎస్ పార్టీ గెలుస్తుందని జోస్యం చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు మల్లెల స్వప్న కుమారి, కాలేరు సింధు తపస్వి, బీ ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వేల్పుల దామోదర్, దిండిగల రాజేందర్, సంకుబాపన అనుదీప్, హుస్సేన్, మల్లెల రవిచంద్ర , మంతెపురి రాజు గౌడ్, జయరాం, మండల పార్టీ అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వర్లు, ముత్యాల రాజేష్, లావుడ్య సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారునికి సహకారం

**కాంగ్రెస్ మండల నాయకుడు మచ్చపోతుల శ్రీనివాస్**



**మునుగోడు, విశాలభారతి:** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నిరుపేద కుటుంబాన్ని చెందిన లపంగి సురేష్ లబ్ధిదారునికి కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మచ్చపోతుల శ్రీనివాస్ 100 బస్తాల సిమెంటును ఇంటి నిర్మాణం కోసం ఉచితంగా అందించారు. లబ్ధిదారుని కుటుంబ సభ్యులు మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవ చేస్తూ మానవతా దృక్పథంతో పేదవారికి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సిమెంటు బస్తాలను ఉచితంగా అందించిన కాంగ్రెస్ మండల నాయకుడు శ్రీనివాస్ కి వారి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## నర్కుడలో ఇందిరమ్మ గృహప్రవేశాలు

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు**



**శంషాబాద్, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన ఇందిరమ్మ గృహాల గృహప్రవేశ కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ లబ్ధిదారులతో కలిసి నూతన గృహాలను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా టి.ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ రిబ్బన్ కట్ చేసి గృహాలను ప్రారంభించడంతో పాటు, సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లబ్ధిదారుల కుటుంబాలకు ఇళ్లను అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. "రాష్ట్రవ్యాప్తంగా లక్ష గృహప్రవేశాలు నిర్వహించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అందులో భాగంగా రంగారెడ్డి జిల్లాలో 3,144 ఇళ్లను లబ్ధిదారులకు అందించడం సంతోషకరం. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యం" అని తెలిపారు.ప్రతి కుటుంబానికి సురక్షిత నివాసం కల్పించడం ద్వారా వారి ఆత్మగౌరవం పెరుగుతుందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, లబ్ధిదారులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు. సొంత ఇంటి కల నెరవేరినందుకు లబ్ధిదారులు ఎమ్మెల్యే గారికి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## కీసర పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ సుమతి

- కీసర పోలీస్ స్టేషన్లో రికార్డ్స్ పరిశీలించిన సిపి
- కీసర గుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్న సిపి సుమతి.




**కీసర,విశాలభారతి :** మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి సోమవారం కీసర పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా స్టేషన్‌లోని సీసీ కెమెరాల పనితీరు,స్టేషన్ పరిసరాల పరిశుభ్రత,రికార్డులు,వివిధ విభాగాల నిర్వహణ,ఇతర సౌకర్యాలను పరిశీలించారు.అనంతరం క్రైమ్ విభాగం సిబ్బందితో,రిసెప్షన్ మరియు ఇతర విభాగల సిబ్బందితో మాట్లాడి వారి విధులపై అవగాహనను పరిశీలించారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించిన సీపీ,అక్కడి పరిశుభ్రత,పచ్చదనం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విభాగాల ఇన్‌చార్జిలు,స్టేషన్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై విధుల నిర్వహణలో మరింత చురుకుదనం ప్రదర్శించాలని ఆదేశించారు.అలాగే సాంకేతిక యాప్‌ల వినియోగం,NPDS కేసుల దర్యాప్తు,మీ సురక్ష అప్లికేషన్‌లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం,వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించడం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు.ప్రజలకు సురక్షితమైన,పారదర్శకమైన, సమర్థవంతమైన పోలీసు సేవలు అందించే దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కీసర ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు,యస్ ఐ లు మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

**కీసర గుట్టలో శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్న సి పి సుమతి.....**

కీసర గుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్న మల్కాజిగిరి సీపీ సుమతి.ఘనంగా స్వాగతం పలికిన ఆలయ అధికారులు.గర్భాలయంలోని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన సీపీ సుమతి. అనంతరం ఆలయ మండపంలో స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసిన ఆలయ అధికారులు.


## జర్నలిస్టు సమస్యలు పరిష్కరించాలి

**టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు వినతి**



**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో వివిధ పత్రికలు, చానల్స్ లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ నాయకులూ కోరారు. ఈమేరకు సోమవారం జిల్లా అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అర్హులైన ప్రతి జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డు మంజూరు చేయాలని, ప్రతి జర్నలిస్టులకు ఇండ్ల స్థలం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అన్నారు. జర్నలిస్టులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో, కళాశాలలో 50 శాతం ఫీజు రాయితీ, జర్నలిస్టు కుటుంబాలకు ప్రైవేటు వైద్యశాలలో రాయితీతో కూడిన వైద్య సౌకర్యం అందించాలని కోరారు. అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులకు రైల్వే పాస్ పునరుద్ధరించాలి, జర్నలిస్టు వాహనాలకు పోలీస్ స్టిక్కర్ ఏర్పాటు చేయాలని, ప్రతి జర్నలిస్టులకు బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు రమణారెడ్డి, భద్రాద్రి జిల్లా అధ్యక్షులు జె. వెంకటరత్నం, కార్యదర్శి జే. రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి నాగచంద్ర, ఐజేయూ జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

## ప్రమాదాన్ని గోప్యంగా ఉంచిన సింగరేణి యాజమాన్యం





- సత్తుపల్లి జేవీఆర్ ఓపెన్‌కాస్ట్ గనిలో ప్రమాదం..
- మీడియా ప్రవేశంపై ఆంక్షలు విధించారన్న విమర్శలు
- డంపర్ పల్టీతో బొలెరో జీపు నుజ్జునుజ్జు
- తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలింపు
- ప్రమాద వివరాలు బయటకు రాకుండా ప్రయత్నించారనే ఆరోపణలు

**విశాలభారతి , సత్తుపల్లి:**

ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని జేవీఆర్ సింగరేణి ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనిలో చోటుచేసుకున్న ప్రమాద ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉపరితల గనుల్లో రవాణా నిర్వహిస్తున్న భారీ డంపర్ అదుపుతప్పి బొలెరో జీపుపై పల్టీ కొట్టిన ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, ప్రమాదం అనంతరం జరిగిన పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి.ఈ ప్రమాదంలో బొలెరో జీపు పూర్తిగా ధ్వంసమై నుజ్జునుజ్జు కాగా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా వెంటనే స్పందించిన అధికారులు క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో సింగరేణి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ప్రమాదానికి సంబంధించిన సమాచారం బయటకు రాకుండా సింగరేణి అధికారులు వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాద స్థలానికి చేరుకున్న మీడియా ప్రతినిధులు ఘటనకు సంబంధించిన దృశ్యాలను చిత్రీకరించేందుకు ప్రయత్నించగా, వారికి అనుమతి నిరాకరించినట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా గనుల ప్రాంతంలోని గేట్లను మూసివేసి మీడియా ప్రవేశాన్ని అడ్డుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా ఇలాంటి పారిశ్రామిక ప్రమాదాల విషయంలో పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడించడం, భద్రతా ప్రమాణాలపై స్పష్టత ఇవ్వడం అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ ఘటనలో ప్రమాదానికి గల కారణాలు, డంపర్ ఎలా అదుపుతప్పింది, భద్రతా నిబంధనలు పాటించారా లేదా అనే అంశాలపై ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన వెలువడలేదు.దీంతో ప్రమాద ఘటనను గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై సింగరేణి యాజమాన్యం పూర్తి స్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఘటన సత్తుపల్లి ప్రాంతంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించాలి



**జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:**

వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, సహజ వనరుల క్షీణత వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా స్థాయి పర్యావరణ పరిరక్షణ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డీఆర్ఓ పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ఒక శాఖ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి వ్యక్తి బాధ్యతగా భావించి ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టనున్న కార్యక్రమాలను గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 1 నుండి 12 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాలు ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించేలా ఉండాలని, ప్రతి గ్రామం, విద్యాసంస్థలు , ప్రతి ప్రభుత్వ కార్యాలయం ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, నాటిన ప్రతి మొక్కను పెంచి పెద్ద చెట్టుగా తీర్చిదిద్దినప్పుడే కార్యక్రమం విజయవంతమవుతుందని అన్నారు. అనంతరం జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ.... ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు తమ తమ పరిధిలో సమన్వయంతో పనిచేయాలని కోరారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు 55 లక్షల మొక్కల నాటే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, ఆ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50 శాతానికి పైగా అటవీ విస్తీర్ణం ఉందని, అన్ని శాఖల సమన్వయంతో గత రెండు సంవత్సరాలుగా ఒక్క ఎకరం పోడు భూమి కూడా నరికివేయకుండా సంరక్షించగలిగామని తెలిపారు. జిల్లాలో పామాయిల్, జామాయిల్, వెదురు తదితర పంటల సాగు విస్తరించడంతో జిల్లా పచ్చదనంతో కళకళలాడుతోందని, రాష్ట్రంలో పచ్చదన పరిరక్షణలో జిల్లా రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన పర్యావరణ పరిరక్షణ గోడపత్రికను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆవిష్కరించారు. అనంతరం అటవీ శాఖ సిబ్బంది విధుల నిర్వహణలో భద్రతకు ఉపయోగపడే సేఫ్టీ కిట్లను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సమావేశంలో అటవీ శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## విశాల భారతి కథనానికి స్పందన

- హైదర్‌నగర్‌లో గుంతల రోడ్డుకు మరమ్మతులు



విశాల భారతి న్యూస్ ఎఫెక్ట్‌తో గుంతల రోడ్డులో మరమ్మత్తులు చేసిన దృశ్యం



హైదర్‌నగర్‌లో అధ్వానంగా రోడ్లు

మరమ్మతులకు అధికారులు స్పందించడం లేదని ఆరోపణ

హైదర్ నగర్ విశాల భారతి: ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 పరిధిలోని హైదర్‌నగర్‌లోని మసీదు లేన్, హనుమాన్ టెంపుల్ రోడ్డు పూర్తిగా దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఈ విషయమై సీఎంసీ ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహాదేవ్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో సమస్య తీవ్రమవుతోందని చెబుతున్నారు. గుంతలమయమైన రోడ్లపై వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టి సమస్య పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

భారతి Main Edition Page 7 31 May 2026
For Advertisement Call +91 99121 62531

విశాల భారతిలో ఆదివారం ప్రచురితమైన కథనం

**హైదర్‌నగర్, విశాల భారతి:** అల్విన్ కాలనీ సర్కిల్ 51 పరిధిలోని హైదర్‌నగర్‌లో మసీదు లేన్, హనుమాన్ టెంపుల్ రోడ్డు దెబ్బతిని ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని 'విశాల భారతి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. సోమవారం హుటాహుటిన మరమ్మతు పనులు చేపట్టి గుంతలను పూడ్చివేశారు. ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారని, వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్కిల్ 51 ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహాదేవ్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆరోపిస్తూ ఆదివారం 'విశాల భారతి'లో కథనం వచ్చింది. కథనం ప్రచురితమైన మరుసటి రోజే అధికారులు స్పందించి సిబ్బందిని పంపించారు. దెబ్బతిన్న చోట సిమెంట్‌తో మరమ్మతులు చేసి, ఆ ప్రాంతంలో వాహనాలు వెళ్లకుండా రాళ్లు, చెక్క పలకలు, నిచ్చెన అడ్డుగా పెట్టారు. సిమెంట్ ఆరిన తర్వాత అడ్డు తొలగిస్తామని సిబ్బంది తెలిపారు.'విశాల భారతి'లో వార్త రావడంతోనే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించారని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అయితే తాత్కాలిక మరమ్మతులు కాకుండా పూర్తిస్థాయిలో రోడ్డు వేయాలని, వర్షాకాలం లోపు మసీదు లేన్, హనుమాన్ టెంపుల్ రోడ్డులో మిగిలిన గుంతలను కూడా పూడ్చాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై అధికారులు ఇలాగే తక్షణం స్పందించాలని కోరారు.

## ముందస్తు పూడికతీత పనులు చేపట్టాలి

**ప్రజావాణిలో జోనల్ కమిషనర్‌కు మేకల కీర్తి హర్షకిరణ్ వినతి**




**సికింద్రాబాద్, విశాలభారతి :** రానున్న వర్షాకాలాన్ని పురస్కరించుకుని బౌద్ధనగర్ డివిజన్‌లో పట్టణ వరదలు (అర్బన్ ఫ్లడింగ్) రాకుండా ముందస్తుగా నాలాల పూడికతీత పనులు చేపట్టాలని కోరుతూ.. సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ .మంగతాయరు కి మేకల కీర్తి హర్షకిరణ్ , డివిజన్ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మేకల కీర్తి హర్షకిరణ్ మాట్లాడుతూ.. నాలాల నుండి తీసిన వ్యర్థాలను రోడ్లపైనే 10 నుండి 15 రోజుల పాటు వదిలేయడం వల్ల, అవి మళ్లీ వర్షపు నీటితో పాటు నాలాల్లోకి చేరి ముంపునకు కారణమవుతున్నాయని , విషజ్వరాలకు దారితీస్తాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కాబట్టి పూడిక తీసిన వెంటనే ఆ వ్యర్థాలను అక్కడి నుండి తరలించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజావాణిలో అందిన ఈ వినతిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు శ్యాము ముదిరాజ్, నాగరాణి, సరిత తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు

**మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**



**సికింద్రాబాద్, విశాలభారతి :** ఓటరు జాబితా ప్రక్షాళన (ఎస్ఐఆర్)లో భాగంగా బౌద్ధ నగర్ జీహెచ్ఎంసీ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ సందర్శించారు. ఈ శిబిరం ద్వారా బౌద్ధ నగర్ డివిజన్ ఓటర్లకు వివరాల సవరణ, కొత్త నమోదు, దోషాలు సరిదిద్దడం వంటి సేవలు అందిస్తున్నారని మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని, అలాగే ఇతరులను కూడా నమోదు చేయించాలని ఆమె కోరారు.ఎస్ఐఆర్ అనేది భారత ఎన్నికల సంఘం నిర్వహించే రాజ్యాంగ బద్ధమైన ప్రక్రియ అని, అనర్హులు జాబితాలో చేరకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్వరూప గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు విశాల్, సతీష్, నవీన్, విజయ, పృథ్వి, శ్యామ్, గౌతమ్, భవాని, లావణ్యతో పాటు బీజేపీ నాయకులు రవి ప్రసాద్ గౌడ్, సుబ్బారావు, ఆగుల్ల శీను, రోహిత్, సోను, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ

- పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు అన్ని సౌకర్యాలు అందజేస్తాం
- మండల విద్యాధికారి జగదీశ్వర్

విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్: 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు అందజేయనున్నట్లు మండల విద్యాధికారి (ఎంఈవో) జగదీశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని విద్యా సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల చదువుకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తుగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులకు విద్యా సంవత్సరం మొదటి రోజు నుంచే పుస్తకాలు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని వసతులను కల్పిస్తున్నట్లు ఎంఈవో జగదీశ్వర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ సిబ్బంది మహేష్, శ్రీలత, గీతారాణి, పాండుతో పాటు మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎంలు) పాల్గొన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులు సూచించారు.





## అలియా భట్‌తో గొడవలంటూ ప్రచారం

బాలీవుడ్ సీనియర్ నటుడు బాబీ డియోల్ ప్రస్తుతం తన కెరీర్‌లో దూసుకుపోతున్నాడు. విలన్ పాత్రల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన, వరుసగా భారీ ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ముఖ్యంగా 'యానిమల్', 'కంగువ', 'హరిహర వీరమల్లు' వంటి చిత్రాలతో దేశవ్యాప్తంగా మంచి క్రేజ్ సంపాదించిన బాబీ డియోల్, తాజాగా తనపై మరియు హీరోయిన్ అలియా భట్‌పై వస్తున్న సోషల్ మీడియా ప్రచారాలపై ఘాటుగా స్పందించారు. అలియా భట్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ఆల్ఫా' చిత్రంలో బాబీ డియోల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో అలియా భట్, బాబీ డియోల్ మధ్య విభేదాలు తలెత్తాయని, ఇద్దరి మధ్య గొడవలు జరిగాయని సోషల్ మీడియాలో పలు కథనాలు వైరల్ అయ్యాయి. ఈ ప్రచారం అభిమానుల్లో కూడా ఆసక్తిని రేకెత్తించింది.ఈ నేపథ్యంలో ప్రముఖ టెలివిజన్ కార్యక్రమంలో పాల్గొన్న బాబీ డియోల్, ఈ వార్తలను పూర్తిగా ఖండించారు. తనకు సంబంధించిన ఈ రూమర్‌ను మొదట చూసినప్పుడు తానే ఆశ్చర్యపోయానని చెప్పారు. ఒక స్నేహితుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కథనాన్ని తనకు పంపించగా, దాన్ని చూసి నవ్వు వచ్చిందని పేర్కొన్నారు. జనాలకు ఖాళీ సమయం ఎక్కువైందనుకుంటా. అందుకే కూర్చొని లేని కథలను సృష్టిస్తున్నారు. నిజంగా అలాంటివి ఎలా ఆలోచిస్తారో కూడా అర్థం కావడం లేదు అంటూ బాబీ డియోల్ అసహనం వ్యక్తం చేశారు.

## ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ

- నూతన ఇందిరమ్మ గృహ ప్రారంభోత్సవం
- పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్న చైర్మన్
- కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు



**విశాలభారతి , అశ్వారావుపేట:** పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ప్రజలకు ఎంతో మేలు చేస్తోందని అశ్వారావుపేట మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ అన్నారు.అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రం పరిధిలోని పెటామలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేసిన చైర్మన్, ప్రతి నిరుపేద కుటుంబానికి సురక్షితమైన నివాసం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.ఇందిరమ్మ గృహాల ద్వారా అనేక మంది పేదలు తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం ముందంజలో ఉందని, ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పాలన సాగుతోందని తెలిపారు.స్థానిక ప్రజలు కూడా నూతన గృహ ప్రారంభోత్సవాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకొని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మండలం కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు జూపల్లి ప్రమోద్ బాబు, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బూసి పాండురంగ, అల్లాడి రామారావు, అల్లాడి నాగరాజు, బోడా రాంబాబు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పాల్వంచలో ఉద్యోగావకాశాలతో ఏఈడీపీ డిగ్రీ కోర్సులు



**పాల్వంచ విశాలభారతి:** విద్యార్థులకు డిగ్రీతో పాటు ఉద్యోగ అవకాశాలను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల, పాల్వంచలో అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఏఈడీపీ) కింద ప్రత్యేక డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ తెలిపారు. బీకాం విభాగంలో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు మరియు బీమా (బీఎఫ్ఎస్ఐ), సైన్స్ విభాగంలో హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్‌లో బీఎస్సీ కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఈ కోర్సుల ద్వారా విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు ప్రాయోగిక అనుభవాన్ని కూడా పొందగలరని పేర్కొన్నారు.ఏఈడీపీ విధానంలో విద్యార్థులు డిగ్రీ చదువుతో పాటు పరిశ్రమలు, సంస్థలలో అప్రెంటిస్‌షిప్ శిక్షణ పొందుతారు. దీంతో ఉద్యోగ రంగానికి అవసరమైన నైపుణ్యాలు, వృత్తిపరమైన అనుభవం, కమ్యూనికేషన్ సామర్థ్యాలు పెంపొందించుకునే అవకాశం లభిస్తుంది. కోర్సు పూర్తయ్యే సమయానికి విద్యార్థులు డిగ్రీ సర్టిఫికెట్‌తో పాటు పరిశ్రమలలో పని చేసిన అనుభవాన్ని కూడా పొందుతారు. ఐదవ సెమిస్టర్ లో అప్రెంటిస్ సమయంలో విద్యార్థులకు నెలకు 12 వేల రూపాయల చొప్పున ఆరు నెలల కాలానికి స్టైఫెండ్ ఇవ్వడం జరుగుతుంది.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సంబంధిత సంస్థల నుంచి ఉద్యోగ ఆఫర్ లెటర్లు పొందే అవకాశాలు కూడా ఉంటాయి. బీఎఫ్ఎస్ఐ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు బ్యాంకులు, బీమా సంస్థలు, ఆర్థిక సేవల సంస్థలు, డిజిటల్ బ్యాంకింగ్ రంగాలలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఆసుపత్రుల నిర్వహణ, ఆరోగ్య సేవల సంస్థలు, వైద్య నిర్ధారణ కేంద్రాలు, ఆరోగ్య బీమా సంస్థలు తదితర రంగాలలో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయి. దోస్త్ మూడవ ఫేస్ ప్రక్రియ కొనసాగుతుందని ఈనెల 15 వరకు మూడవ ఫేస్ అడ్మిషన్లు జరుగుతాయని కాబట్టి విద్యార్థులు అందరూ తప్పనిసరిగా ఏఈడిపి కోర్సుల్లో చేరి తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆమె కోరారు.ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ కోరారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల, పాల్వంచను సంప్రదించాలని సూచించారు.

## పడిగాపురంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చొరవతో నూతన బోరు పనుల ప్రారంభం
- ప్రజా సంక్షేమం - గ్రామాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్



**విశాలభారతి:** కరకగూడెం మండలం, రేగళ్ల గ్రామపంచాయతీ పరిధిలోని పడిగాపురం గ్రామంలో గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు గౌ. శ్రీ పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవతో మంజూరైన నూతన బోరు పనులను సర్పంచ్ బాడీషా పార్వతి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ, గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎల్లప్పుడూ ముందుంటున్నారని తెలిపారు.ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వజ్జా కోటేశ్వరి , కార్యదర్శి శ్రీనాథ్ , మాజీ సర్పంచ్ కుంజా వసంతరావు , మాజీ ఎంపీటీసీ బిజ్జా రామనాథం, మాజీ ఉప సర్పంచ్ బాడీషా లక్ష్మీనారాయణ , వార్డ్ మెంబర్ పద్మ , అంగన్వాడి టీచర్ సునీత , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాలానగర్ ఇన్‌స్పెక్టర్‌కు 'తెలంగాణ పోలీస్ సేవా పతకం'



**కూకట్ పల్లి విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేళ పోలీస్ శాఖలో పండుగ వాతావరణం నెలకొంది. విధి నిర్వహణలో అసాధారణ ప్రతిభ, అంకితభావాన్ని కనబరిచిన పోలీస్ అధికారులను ప్రభుత్వం సేవా పతకాలతో గౌరవించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో మొత్తం 631 మంది సిబ్బందిని ఈ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఇందులో భాగంగా బాలానగర్ ఇన్‌స్పెక్టర్ టి. నర్సింహా రాజును ప్రతిష్టాత్మక 'తెలంగాణ పోలీస్ సేవా పతకం' వరించింది. వివిధ విభాగాల్లో కనబరిచిన ధైర్యసాహసాలు, నిబద్ధతకు గుర్తింపుగా రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ అధికారులను ప్రభుత్వం ఈ అవార్డులకు ఎంపిక చేసింది. ఇందులో బాలానగర్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ టి. నర్సింహా రాజు తన విశిష్ట సేవలకు గానూ 'తెలంగాణ పోలీస్ సేవా పతకానికి' ఎంపికై ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఈ సందర్భంగా సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వం ఇచ్చే ఈ గుర్తింపు ఎంతో గర్వకారణం. బాధ్యతను మరింత పెంచింది. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ పతకాలను అందజేయనున్నారు. ఈ పురస్కారం రావడానికి సహకరించిన ఉన్నతాధికారులకు, తోటి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు." ఈ పురస్కారాలు పోలీస్ శాఖలో మరింత ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, ప్రజల కోసం మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు తోడ్పడతాయని సీఐ నర్సింహా రాజు ఆశాభావం వ్యక్తం చేశారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.